# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 34 సంచిక 3
పేజీలు 40
నవంబర్ 2014

**5సం॥ల చందా రూ. 250**
**2సం॥ల చందా రూ. 120**
**సంవత్సర చందా రూ. 60**
**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C Y.S.C.K.P.M
చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ............................ ...... **పేజీ**


భద్రవాక్యం ................................2
శ్రీబాబూజీ ఉవాచ................................3
అమ్మమాట.......................................................5
సన్నిధిలో సంభాషణ ..............................7
యోగవాశిష్ఠము ................................10
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు.....................12
పరిప్రశ్నేన సేవయా.............................14
సద్గురు శ్రీయాత్రా దర్శన్......................16
భక్త మార్కండేయ .............................18
నియమిత వేళలో ప్రార్థన చేయాలి ...........19
సులభమా! మాకు సులభమా! .......................20
ధ్యానం - మాధవ స్థితి..........................21
శ్రీకృష్ణకర్ణామృతము............................24
ధ్యానం చేసే విధానం..........................26
జ్ఞానయోగ మహాత్మ్యం.........................29
సత్సంగామృతం................................31
హనుమద్వైభవము.............................33
సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర...........35
విష్ణు కథలు - సదాశివ బ్రహ్మేంద్రసరస్వతి....37
హైదరాబాద్‌శాఖ భవననిర్మాణం............40

## భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

వాయురనిల మమృతమ్ అథేదం భస్మాన్తగ్ం శరీరమ్ ।
ఓం క్రతోస్మర కృతగ్ం స్మర, క్రతోస్మర కృతగ్ం స్మరః ॥
(ఈశావాశ్యోపనిషత్ 17శ్లో)

'జగత్యాం జగత్' అంటే సృష్టి ధ్యేయాన్ని గ్రహించిన సాధకుడు తన సాధన ధ్యేయం ఏమిటో స్పష్టంగా తెలుసుకోగలుగుతాడు. ఈ జగత్తులో వ్యవహారం చేస్తూ కర్మలు ఆచరించక తప్పదు. అయితే తాము ఆచరించే ఏ కర్మలైనా ఈశ్వర తత్త్వమునే ధ్యేయంగా ఆచరించాలి. సాధన చతుష్టయాన్ని సాధించే దిశలో ఇంద్రియ కర్మలను ఆచరించాలి. అటువంటి సాధకునికి 'న కర్మ లిప్యతే నరే' అని చెప్పబడినట్లు కర్మబంధన ఉండదు.



జగత్తును తన దేహమును ప్రకాశించు ఈశ్వరుని గుర్తించని సాధకుడు తన మనస్సును హెచ్చరించి, సంసార బంధనము నుండి బయటపడాలి. శ్వాస మరణము లేని వాయువు దేహములో శాశ్వితంగా నిలవదు సుమా! అది చలించేదే. దేహం కూడా శాశ్వతమైనది కాదు. అది దగ్ధమైనప్పుడు దేహము నుండి వాయువు దహింపబడక లేచి పోతుంది. మనస్సును సాధకుడు అనుక్షణం హెచ్చరించాలి. దేహం భస్మం అయ్యేలోపుగా మనస్సు యొక్క అధీనంలో ఉన్న ఇంద్రియాలు నిర్వహించిన కర్మల నుండి విముక్తి కలగాలి. సంసార తాపత్రయం నశించాలి. జగద్భావం నశించాలి.

సాధన ధ్యేయాన్ని అనుక్షణం గుర్తించి అప్రమత్తుడవై తత్త్వ సాధనను పటిష్టంగా చేస్తూ దేహాత్మ భావనను నశింప చేసుకోవాలి. ఇంద్రియ ప్రవృత్తిని గుర్తించాలి. అంతేకాదు నిగ్రహించాలి. దానికి పరిష్కార మార్గము ఓంకార తత్త్వాన్ని స్మరించమని మనస్సుతో మొర పెట్టుకోవాలి. సాధించాలి. మనస్సుతో ధ్యేయాన్ని గుర్తించి, స్మరణ మరువని సాధకుడు చేసే ప్రయత్నానికి సద్గురుమూర్తి ఆధీనంలో ఉన్న మనస్సు అనుకూలించక తప్పదు కదా! సద్గురుమూర్తిని ఆశ్రయించిన ముముక్షువుకు సాధ్యం కానిది ఉంటుందా!

# శ్రీ బాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధ చేస్తూ "సందేహ నివృత్తికానంత వరకు మనస్సు నిలబడదు. ఎన్ని శాస్త్రాలు చదివినా, ఎంత పండితులైనా సమర్థులైన సద్గురువును ఆశ్రయించినా మనస్సులో సంశయాలున్నంత వరకూ జన్మరాహిత్యము పొందజాలడు. శ్రీ రమణ మహర్షి శిష్యులలో మహా పండితుడైన గణపతి ముని వుండేవాడు. ఆయనకి అనేక సందేహాలు కల్గుతూ వుండేవి.



మా రమణుడు గణపతిముని సందేహాలన్నీ తీర్చేవాడు. ఆయన వ్యక్తం చేసిన సందేహాలలో గురువు ఎంతవరకు అవసరము? సాధకుడు గురుశిక్షణ లేకుండా సాధన కొనసాగించలేడా? అనే ప్రశ్నలు ఉత్పన్నమయినాయి. చూశారా! పండితులైన గణపతిమునికే అటువంటి సందేహాలు కలిగితే ఇక సామాన్య సాధకుల విషయం ఏం చెప్పగల్గుతాము? శ్రీ రమణుడు ఆయన అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్తూ 'నేనెవరు?' అన్న ప్రశ్నవేసుకో. విచారణ చెయ్యి. దాని ద్వారా వచ్చే సమాధానమే నీ సందేహాన్ని తీర్చగల్గుతుంది.

ఇక్కడ మీకొక ఉదంతం చెబుతాను. బాహ్య పొరలలో కప్పబడియున్న ఒక విత్తనానికి లోపల అంకురం ఉంటుంది. అది మొలకెత్తి ఆకులు, రెబ్బలు, కొమ్మలువేసి పెరుగుతుంది. క్రమేపీ పూలు పూస్తుంది. కాయలు కాస్తుంది. కాయలు పక్వ స్థితికి రాగానే అవి మొక్కనుండి వేరుపడి రాలిపోతాయి. ఆకులు కూడా రాలిపోతాయి. పూలు ఏమన్నా మిగిలివుంటే రాలిపోతాయి. జన్మకు వచ్చిన ఏదైనా రాలిపోయేదే కదా! కానీ ఆ చెట్టు మీద ఉన్నవన్నీ రాలిపోయినా ఆ చెట్టు మ్రాను మాత్రం మిగిలివుంటుంది. అలాగే జన్మకు వచ్చిన జీవుడు దిన దిన ప్రవర్ధమానమై పరిణామము చెంది నశించవల్సినదే కదా! కానీ ఆ జీవునికి ప్రకాశాన్నిచ్చి పరిణామం చెందక, నశించని వస్తువు మిగిలి వుంటుంది. అదే చైతన్యము, మా రమణుడు గణపతిమునిని గుర్తించమన్నది దానినే కదా! ఒక ఉల్లి పాయలో పొరలన్నీ తొలగించి వేస్తే మిగిలేది ఏముంది? తొలగించే వాడు మిగులుతాడు. ఈ ఉపమానాన్ని అర్థం చేసుకోండి.

ఒక సాధకుడు తన స్థితిని మహాత్ములతో పోల్చుకోకూడదు. అది ఎలా వుంటుందంటే ఒక పికిలి పిట్ట నెమలి పిట్టంత గుడ్డును పెట్టాలంటే ఏమౌతుంది? అది దాని శక్తికి మించిన పని. ఒక పర్యాయము రమణ మహర్షిని ఒక తేనెటీగ కుట్టింది. ఆయన కాలంతా వాచిపోయింది. శిష్యులంతా కంగారు పడిపోయి ఆ తేనెటీగను పట్టుకుని చంపబోయారు. రమణ మహర్షి వారిని అలా చేయవద్దని వారించి అది నివశించే ప్రదేశంలో మీరు దానికి ఏదో విధంగా అశాంతిని కలుగజేయబట్టే అది ఆత్మరక్షణ కోసం వచ్చినన్ను కుట్టింది. ఈ రకంగా నేను కర్మని అనుభవించిక తప్పదు. అలా అనుభవించక పోతే పునర్జన్మ తప్పదుకదా? అని అన్నారు.

చూశారా! మహాత్ముల మనస్సు ఎంత నిర్మలంగా నిశ్చలంగా ఉంటుందో! ఆ స్థితినే తితీక్ష అంటారు. మరి సాధకుని మనస్సు అటువంటి స్థితిలో ఉండగల్గుతుందా! మనసులో ఏసంకల్పం జనించినా ఏ ఒక్క బాహ్య సంఘటన అయినా నీ మనస్సుని కుదిపివేస్తుంది కదా! కష్టము కల్గితే దుఃఖించడం, సుఖము కల్గితే ఆనందించడం తప్పదు కదా! ఇటువంటి మనస్సును సక్రమమైన మార్గములోనికి తెచ్చుకొనడానికి సద్గురుమూర్తిని ఆశ్రయించవల్సినదే కదా! నువ్వు చదివిన గ్రంథాలు గానీ, నువ్వు ఆర్జించిన పాండిత్యము గానీ నీమనోప్రవృత్తిని మార్చగల్గుతుందా?

శ్రీ రమణుడు బాల్యంలో స్కూల్‌కి వెళ్ళకుండా స్వేచ్ఛగా తిరిగేవాడు. ఈ విషయం తెలిసి అన్నగారు స్కూల్‌కి ఎందుకు వెళ్ళటంలేదు అని కోపంచేసి ఛెళ్ళున చెంపమీద ఒక దెబ్బవేశాడు. ఆ క్షణం నుంచి ఇంటినుండి పారిపోయి దూరంగా ఉన్న ఒక కొండపైన స్థిరంగా కూర్చుని అసలు నేనెవరు? అని ప్రశ్న వేసుకుని విచారణ చేస్తూ ధ్యానంలో ఉండిపోయారు. త్వరలోనే దానికి సమాధానం దొరికింది. మరి ఆ సమాధానాన్ని స్ఫురింపచేసింది ఎవరు? అదే సర్వజగత్తుకి, సర్వసృష్టికి ఆధారమైన గురుతత్వం. ఇప్పుడు చెప్పండి? గురువు అనుగ్రహం లేనిదే ఏదీ సాధ్యపడదు. అయితే ఒక విత్తనానికి బాహ్య పొర ఉన్నపుడు దాని అంకురం ఎలా జన్మకి తీసుకువస్తుందో అలాగే మానవుడు అహంకార మమకారములు అనే పొరలు మనస్సుని ఆవరించి ఉన్నంత వరకూ 'నేనెవరు?' అన్న ప్రశ్నకు సమాధానము స్ఫురించదు. కావున పునర్జన్మ తప్పదు" అన్నారు శ్రీ బాబూజీ మహారాజ్.

# అమ్మమాట

-జపమాలా ప్రసాద

## బ్రహ్మజ్ఞానమే గురువు

అచింత్య అవ్యక్త రూపాయ । నిర్గుణాయ గుణాత్మనే ।
సమస్త జగదాధార మూర్తయే బ్రహ్మణే నమః ॥

సమస్త జగత్తుకీ ఆధారభూతమైన ఏ అనంతశక్తి ఉన్నదో, అది చింతించుటకు వీలు కానిది; వ్యక్తపరుద్దామా అంటే అవ్యక్తమైనది; గుణరహితమైనది; సమస్త కళ్యాణ గుణములకు నిలయమైనది; అదియే 'పరబ్రహ్మ' వస్తువు. అట్టి పరబ్రహ్మమునకే మనము 'గురు' అని పర్యాయ పదమును వాడుతున్నాము. అట్టి గురు పరమాత్మకు నమస్కారము.

మామూలు వాడుక భాషలో 'గురువు' అంటే అన్నిటికంటే 'గొప్పది' అని అర్థం. సమస్త జగత్తుకీ ఆధారం అంటే, ఇక అట్టి శక్తిని మించినది ఏముంటుంది. అంతటా నిండి ఉన్నా కూడా, మనం ఆ శక్తిని అనుభవిస్తున్నా కూడా, అది అవ్యక్తము, అచింత్యము, రూప, నామ, క్రియా రహితము. మరి దీనిని అర్థం చేసుకోవడం ఎలా?

మన పూర్వ మహర్షులు, భక్తులు, జ్ఞానులు అయిన మహాత్ములెందరో ఆ అనంత శక్తిని దర్శించి, అనుభవించి, వారి అనుభవాలను మనకు ఉపనిషత్తుల రూపంలోను, వాగ్రూపం లోను, గేయ రూపంలోను అనేక విధాలుగా అందించారు. అట్టి కోవకు చెందిన మహా భక్తాగ్రేసరులు, జ్ఞానాధికులు అయిన కబీర్‌దాస్ మహాత్ముడు ఒకానొక కీర్తనలో గురువు యొక్క గొప్పతనాన్ని వర్ణిస్తూ .................... బ్రహ్మజ్ఞాని అయిన గురుదేవుడు ఒక కాకిని హంసగా మార్చగలిగే ఘనుడని వివరించారు.

కాగ్ పలట్ గురు - హంసా కీన్హీ । దీన్ హీ నామ్ నిషానీ ।
హంసా పఃహుంచే సుఖ్ సాగర్ పర్ । ముక్తి భయే జహపానీ॥

కామక్రోధాది గుణములతో, ఈర్ష్య, అసూయ, అసహనము, ఓర్వలేనతనము వంటి దుష్ట వాసనలతో, కాకిలాగ నల్లగా, అసహ్యంగా ఉండే మనస్సు కలిగిన మానవులకి సత్యగురుదేవుడిచ్చే లక్ష్యార్థ జపము, ధ్యానము 'నామ్ నిషానీ' అని వర్ణించారు శ్రీ కబీర్. 'నిషానీ' అంటే గురుతు. తన స్వస్వరూపాన్ని మరచి మాయకు గురయిన మానవునికి, తిరిగి తన గురుతును తెలిపే నిషానీ 'గురు లక్ష్యార్థము' లేక

'గురుమంత్రము'. బ్రహ్మజ్ఞానియైన గురుమూర్తి మనకు లభ్యమయి, మనకు మంత్రమును ఉపదేశిస్తే, ఆ మంత్రజపము మనకు నిజమైన గురుతును తెలిపి అమరత్వాన్ని ప్రసాదిస్తుంది.

'హంస శివస్సోऽహమ్' అనే సూచన మంత్రాన్ని గురువులు తెలియజేస్తారు. హంస నీళ్ల నుండి పాలను విడదీసి, పాలనే గ్రోలినట్లు, సత్యాసత్యములు, నిత్యానిత్యములతో మిశ్రితమై ఉన్న ఈ జగత్తులోని అనిత్యమైన, అసత్యమైన అనాత్మను వీడి, నిత్యము, సత్యము అయిన ఆత్మవస్తువునే నీవు గ్రహించిననాడు, ఆ నిత్య, సత్య, ఆత్మవస్తువైన, మంగళ స్వరూపమైన శివ స్వరూపం నీవే అని గుర్తిస్తావని యీ మంత్రం మనకు సూచిస్తుంది. ఈ మంత్రం మన శ్వాసతో బాటు జరిగే 'అజప గాయత్రి'. ఎప్పుడయితే నీవు శవ స్వరూపం కాదు - శివ స్వరూపమే అని గుర్తిస్తావో అదే ముక్తి; ఈ హంస హాయిగా సుఖమైన సచ్చిదానంద సాగరంపై విహరిస్తుందని శ్రీ కబీర్‌దాసు వివరించారు.

'జల్ బీచ్ కుంభ్ - కుంభ్ బీచ్ జల్ హై। బాహర్ భీతర్ పానీ।
వికసా కుంభ్ జల్-జల్ హి సమానా। యే గతి విరలే న జానీ॥

నీటి మధ్యలో ఒక కుండ ఉంది. కుండ లోపల కూడా నీళ్ళు ఉన్నాయి. ఒకవేళ కుండ పగిలిపోతే, కుండ లోపలి నీళ్ళు, బయట ఉన్న నీళ్లతో కలిసిపోతాయి. ఈ శరీరమే ఒక కుండ. దీని లోపలా ఆకాశం ఉంది; బయటా ఆకాశం ఉంది. కుండ బ్రద్దలయినా, దాని లోపల ఆకాశం బ్రద్దలవదు. ఘటాకాశం మహాకాశంలో లీనమయి పోతుంది. శరీరమనే ఘటం - ఆవరణ విచ్ఛిన్నమవుతుంది గానీ, దానిలోనే ఉండి, దానిని ప్రకాశింప చేస్తున్న చైతన్యానికి మార్పులేదు. ఈ గతి సత్యగురువులను ఆశ్రయించిన వారికే తెలుస్తుంది అని శ్రీ కబీర్ వక్కాణించారు.

-సశేషం

**పూజ్య శ్రీమాతాజీవారి సత్సంగ కార్యక్రమాలు**
**కట్టమూరు గ్రామంలో డిసెంబర్ 15, 16, 17**
**తేదీలలో జరుగును.**
**పూర్తి వివరములకు - కోదండరామ్ - 97043 00241**

## సన్నిధిలో సంభాషణ

– పరాశర ప్రసాద్

19-12-1985

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ "అరుణని చూసి అక్కయ్యా! ఉపన్యాసం వినమ్మా" అన్నారు. "మీరు చెప్పేది వారికి అర్థంకాక confuse అవుతున్నారయ్యా. అన్నీ తలచిక్కు బేరాలు తెచ్చి పెడతారు. 'మయిసన్న్యస్య ' అంటే ఏమిటో విడదీసి అర్థం చెప్పవయ్యా' అని రత్నంగారిని అన్నారు. పోనీ గురువుగారిని చెప్పమనవయ్యా. మాకు అర్థం అయ్యేలాగా ఎవరో ఒకరు చెప్పండి. భయపడకండి మీనుంచి మాకు తెలియనిది ఏమన్నా ఉంటే తెలుసుకుందా మని మా ఆకాంక్ష. అంతేగానీ మిమ్మల్ని కించపరుద్దామని కాదు. ఏమంటారు రాఘవాచార్యులుగారూ? మేము ఏమన్నా తప్పు మాట్లాడామండీ?



అలా చూస్తారేమండీ? ఓహో! మీ పేరు శ్రీనివాస అయ్యంగారు కదూ! వసిష్ఠులవారు శ్రీరామచంద్రుని 'రఘునాధా!' అని పిలిచినట్లు మీరు ఎంతైనా హెడ్‌మాష్టారుగారు కదా! నాకు గురువులాంటి వారు. అందుచేత అలా సంబోధించాము" అన్నారు శ్రీబాబు.

అయ్యంగారు మాట్లాడుతూ 'బాబూజీ! మీరు మాకు బాలకృష్ణుడిగా కనిపిస్తున్నారు. ఎందువలన అంటే ఒక చిన్న పిల్లని మీరు అక్కయ్యా! అని సంబోధించారు కదా!' శ్రీబాబు వెంటనే కలుగజేసుకుని "మీలాంటి పండితులంటే మా గుండె టకాటకా కొట్టుకుంటుంది. నేను అక్కయ్యా! అని ఎందుకు సంబోధించానంటే అకారం బ్రహ్మరూపం. అకార ఉకార మకారములకు మూలమైనటువంటి ఆదిమధ్యాంత రహితమైన ఆ పరబ్రహ్మ స్వరూపమును దర్శించి అలా పిలిచాను. అంతేకాని చిన్న పెద్ద అనే వయస్సుతో తారతమ్యం గాని వీడు గొప్పవాడు వాడు బీదవాడు అనే భేదభావంగాని మాకులేవు. అందరిలోనూ ఆ పరమాత్మ వస్తువునే దర్శిస్తాను. మిమ్మల్ని కూడా రాఘవచార్యులుగారు అని సంబోధించాటానికి కారణం మీకు మాకు మధ్య అనేక జన్మల లింకు ఉంటుంది. ఆ పిలుపు వెనక ఆత్మీయత ప్రేమ ఉంటాయి. కాని

సామాన్య మానవుల దృష్టి అలా ఉండదు. పైకి ఎంతో ఆప్యాయంగా నవ్వుతూ మాట్లాడతారు. ఆ నవ్వు వెనక ఉండే భావాలు వేరు. అందుచేతనే 'ముఖం పద్మ దళాకారం, వర్చస్సు చందన శీతలం, కాని వాడి హృదయం మాత్రం మంగలికత్తి కన్నా పదునుగా ఉంటుంది' అని అంటారు. కాబట్టి మీరు పరమాత్ముని దర్శించాలంటే ఎటువంటి దృష్టి కలిగి ఉండాలో ఆలోచించండి" అన్నారు శ్రీబాబు.

శ్రీనివాస అయ్యంగారు మాట్లాడుతూ 'మేము నర్సరీ పిల్లలము. మీరు Ph.D degree ఉన్న Professor. మీరు చెప్పింది వినటానికి మేము వచ్చాము' అన్నారు. శ్రీబాబు కలగజేసుకుని "మాకు ఏరకమైన డిగ్రీలు తగిలించకండి. మాకు ఉన్న డిగ్రీ అల్లా 'H' అనే అక్షరం 'H' అంటే హనుమత్ అని అర్థం. దీనిని అర్థం చేసుకుంటే చాలు. హనుమంతుడు ఏ విమానము లేకుండా సాగరాన్ని లంఘించి తనదారికి అడ్డం వచ్చిన రాక్షసులందరిని సంహరించి ముక్తికాంత అయిన సీతాదేవిని చేరుకున్నాడు. ఆవిడ ప్రకృతి అంతటిని మురిపింపజేసే భూలోక సుందరి. అలా చేరుకోటానికి తోడ్పడిన శక్తి ఏది? హనుమంతుని ప్రభుభక్తి అటువంటిది. ఆయన రోమరోమం రామరామ అని స్మరిస్తుంది. అటువంటి నిరంతర హరినామస్మరణ చేసేవారికి లోటు ఏముంటుందండీ రాఘవాచార్యులుగారూ?" అన్నారు శ్రీబాబు మాట్లాడుతూ.

అంతలో అయ్యంగార్ లేచి 'ఈ చరణ్‌దాస్ అనేవ్యక్తి కొన్ని సంశయాలు లేవనెత్తుతున్నాడు' అనగానే శ్రీబాబు కలగజేసుకుని 'ఆ సంశయాలేవో అడగమనండి' అన్నారు. చరణ్‌దాస్ లేచి రెండు సంశయాలని వెలిబుచ్చాడు 1)శ్రీరామచంద్రుడు సీతాదేవికన్నా వయస్సులో పెద్దా లేక చిన్నా 2) రాముడు కృష్ణుడు సామాన్యమానవులే కదా వారిని భగవంతునిగా ఎలా భావిస్తారు? ఏసు ఒక్కడే పరమాత్ముడు ప్రభువు అని క్రిష్టియన్లు అంటారు కదా!" అన్నారు.

శ్రీబాబు సమాధానం చెపుతూ "శ్రీరామచంద్రుడు సామాన్య మానవుల లాగా జన్మించాడా? దశరథ మహారాజు పుత్ర కామేష్టియాగం చేయటం, పాయసం లభించటం ఆ పాయాసాన్ని కౌసల్య, సుమిత్ర, కైకేయి స్వీకరించటం దానివలన శ్రీరామచంద్రుడు ఆవిర్భవించటం మీ కందరికి తెలిసినదేకదా! రాముడు సామాన్య మానవుడి లాగా సంచరించి మానవులందరికి తనలాగా ఆచరించమని బోధించాడు.

ఆయన కేవలం అవతార పురుషుడు. ఆయనకి వయస్సుతో పని ఏముంది? అలాగే కృష్ణపరమాత్ముడు ఎలా ఆవిర్భంచాడో మీకు తెలిసినదేకదా! ఆయన చేసిన లీలలు సామాన్య మానవులెవరైనా చేయగలరా?

ఏసు క్రీస్తుకి కూడా తల్లితండ్రి ఉన్నారు. ఆయన పశువుల పాకలో సామాన్య మానవునిలాగా ఉద్భవించాడు. ఆయన బోధించినది ప్రేమ తత్త్వమేగా? ఏ గ్రంథము బోధించినా సర్వప్రకృతిని ప్రకాశింపజేసే అత్మవస్తువు ఒక్కటనేగా! అందులో తేడా ఏమన్నా ఉన్నదా? ఆ ఆత్మవస్తువునే మనము రాముడని, కృష్ణుడని, శివుడని నమ్ముతున్నాము. ఏసు ప్రభువుగాని మహమ్మద్‌వారుగాని ప్రవక్తలు. అటువంటి ప్రవక్తలు భారతదేశంలో ఎంతమందో ఉద్భవించారు. వారంతా బోధించినది పరమాత్మ తత్త్వమే. ఏ మతాన్నీ మనం విమర్శించకూడదు. మతాలన్నీ నదుల వంటివి. అవి అన్నీ పరమాత్మ తత్త్వమనే సాగరంలో కలిసిపోవలిసిందే. సాగరంలో కలిసిన తర్వాత నదులను వేరు చేయగలుగుతామా అండీ? చెప్పండి అన్నారు శ్రీబాబు.

అయ్యంగారు మాట్లాడుతూ 'ఒకనెలరోజులు మాకు సెలవులు కాబట్టి రోజూ మీ ఉపన్యాసం వినటానికి వద్దామనుకుంటున్నాను' అన్నారు. "నెలరోజులేనా? శాశ్వతంగా ఇక్కడికి వస్తారేమో అనుకుంటున్నాను" అన్నారు శ్రీబాబు.

అయ్యంగారు మాట్లాడుతూ 'నేనూ అలాగే భావిస్తున్నాను బాబూ' అన్నారు. శ్రీబాబు మాట్లాడుతూ "మంచు చూడటానికి గట్టిగా ఉంటుంది. అది కరిగితే నీళ్ళు అవుతుంది అలాగే మీలో విశ్వాసం చివరిదాకా ఉండాలికదా! భగవంతుని ఆశ్రయించండి, అది సాధ్యపడుతుంది" అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ "మయి సన్న్యస్య అంటే అర్థం చెప్పలేదు. మయిసన్న్యస్య అంటే నా ఇంద్రియాలు సన్న్యసించాలి అని అర్థం. ఇంద్రియాలు అన్నీ ఎప్పుడు సన్న్యసిస్తాయి? మనస్సు పరమాత్ముని యందు లగ్నమైనప్పుడే మనోలయమవుతుంది. అప్పుడు ఇంద్రియ దృష్టి ఉండదు. ఇంద్రియ దృష్టి లేనప్పుడు ఇంద్రియాలు సన్న్యసించినట్లేగా" అన్నారు శ్రీబాబు.

(గత సంచిక తరువాయి) # యోగవాశిష్టము -సుషుమ్న ప్రసాద

యమ ధర్మరాజనుజ్ఞ ప్రకారము శుక్రుడు వాసుదేవుని శరీరాన్ని విసర్జించి తన పూర్వ శరీరంలో ప్రవేశించాడు. వెంటనే నిర్జీవమైన శరీరములోని నరములు, ధాతువులు, కణములన్నిటిలో రక్తము ప్రవహించి, వర్షాకాలంలో యెండిపోయిన నదులు వరదలు వచ్చి పూర్తిగా జలమయ మయినట్లు, ఆ శరీరము సజీవమయింది. శరీరములో రక్తము చక్కగా ప్రవహించగానే, సరస్సులోని పద్మములు చక్కగా వికసించినట్లు అతని అవయములన్ని సజీవమై వికసించాయి, నాడులన్నీ ప్రాణము శరీరమంతా స్వేచ్ఛగా విహరించేట్లు చేశాయి.



వృద్ధుడైన భృగు మహర్షి తన కుమారుని విగత శరీరము, సజీవము కావటము చూచి, తన కమండలము నుండి పవిత్రజలాన్ని తన పుత్రుని శరీరము పై తగు మంత్రోచ్ఛారణతో ప్రోక్షించాడు. శుక్రుడప్పడు భూమి పై నుండి లేచి, తన తండ్రికి మోకరిల్లాడు, భృగు మహర్షి శుక్రునాలింగనము చేసుకొని, అనురాగంతో, ఆనంద బాష్పాలు వరదలై వర్షించాయి. ఇరువురూ వారి పునస్స మాగమనమున కెంతో, ఆనందిచారు, తండ్రి, తనయులిరువురూ, జీవన్ముక్త స్థితిలో వారి సమయాన్ని గడిపారు. దేశ, కాల విభిన్న పరిస్థితుల మధ్య వారి స్థిత ప్రజ్ఞత్వమును, మానసిక ప్రశాంతతను పరిరక్షించుకొన్నారు. క్రమేపి, కొంతకాలమునకు శుక్రుడ సురులాచార్య పదవిని చేపట్టాడు భృగు మహర్షి తన పిత్రార్జితమైన పదవిలోనే వుండి, మానవులపై అధికైరమును పొందాడు.

ఆ విధంగా వశిష్ఠ మహర్షి తన కథను ముగించాడు. వశిష్ఠ మహర్షి మాట్లాడుతూ "వేదాంత గ్రంథముల నధ్యయనము చేసే విద్యార్థి, విద్యా ఫలితమును గురించి, ఆశించ గూడదు, అతను బ్రహ్మము లేక శాశ్వతమైన అత్మపై యేకాగ్రతతో ధ్యానము చేయాలి. క్రమేపి మనస్సు పవిత్రమై, పరిణతిచెంది, స్థిరత్వమును పొందుతుంది, అలా క్రమేపి మనసుకు ఆత్మసాక్షాత్కారము లేక సంపూర్ణ స్వేచ్ఛ లభిస్తుంది.

ఎవరైతే దారా పుత్రాదులపై, సంపద, ఆస్తి, ప్రాపంచిక విషయాలపై యెక్కువ అనుబంధాన్ని, మమతను పెంచుకొంటారో, వారు శోక తప్త హృదయులౌతారు; అంతులేని ఆశ, ఆశయాలతో బంధితుడవుతున్నాడు, దానికి మనశ్శాంతి లేదు. విషయాసక్తమైన జీవితాన్ని గడిపేవాడు ఎలాంటి లబ్ధిని పొందలేడు. అట్టివాడు అసత్యాన్ని సత్యంగా భావించి, తన గమ్యాన్ని జీవితాన్ని కోల్పోతున్నాడు. అన్ని బాధలకు ధనమే మూలకారణము, ధన సముపార్జనయే బాధాకరమైనది, ఆ సంపదను సంరక్షించుకోవటం మరీ కష్టతరం. సరే, ఆ సంపదను కోల్పోయామంటే, ఆ బాధ వర్ణనాతీతము, కాని యెవరు వైరాగ్య, వివేక సంపన్నులై వుంటారో, ఎవరీ జగత్తును తృణప్రాయంగా చూస్తారో, ఎవరు పాము కుబుసమును వీడినట్లు, ప్రాపంచిక విషయాలను విడనాడి, నిర్లిప్తుడుగా వుంటాడో, అతనికే బాధలుండవు.

ఈ సంసారమనే భయానక సముద్రమును దాటాలను కొనేవాడు మంచి అవగాహన కలిగి, పవిత్రమైన హేతుబద్ధుడై, పవిత్ర గ్రంథ పఠనము చేస్తూ, అసత్యమును, దుష్కృత్యములను విడనాడి, క్రమబద్ధమైన జీవితాన్ని గడుపుతాడు. ఎవరైతే వేదాలు నిర్దేశించిన పథంలో పవిత్ర హృదయులు, సత్యగాములై, పయనిస్తారో, ఎవరు సత్పురుషుల సాంగత్యములో పునీతులౌతారో, వారు వినాశము నుండి రక్షింపబడుతారు. అట్టి వారు పరహితులై ముముక్షుత్వమును పొందుతారు, ఎవరు ఆత్మ జ్ఞానముతో దివ్యజ్యోతిని దర్శిస్తారో, వారు అష్టదిక్పాలకులైన దేవగణముతో రక్షింపబడుతారు, ఎవరైతే జ్ఞాన తృష్ణ కలిగి, సత్యాన్వేషులై, పవిత్రమైన విశ్వప్రేమ కలిగి వుంటారో, నిరంతరము ఆత్మ విచారణలో లీనమయివుంటారో, వారే మానవులని పిలపించుకొనటానికి కర్హులు, మిగిలిన వారందరూ, పశుప్రాయులే.

"ఎవరు తప్పడు మార్గములో నడవకూడదు, ఎవరూ చేయకూడని అకృత్యములను చేయకూడదు, రాహువు తప్పడు మార్గములో నడిచి, అభ్యంతరకరమైన కార్యముచేసి నందుకు, రాహువు అమృత పానము చేసినందుకే, అనేక కష్ట నష్టములకు బాధలకు లోనై నాడు".

-సశేషం

# శ్రీ కాళీ గార్డెన్స్ కార్యక్రమాలు

<u>నవంబర్ 2014</u>

3 సోమ : ఏకాదశి, ఏకాహం సంకీర్తన, శ్రీసద్గురుపాదపూజ.

4 మంగళ : క్షీరాబ్ధి ద్వాదశి, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన

6 గురు : కార్తీకపూర్ణిమ శ్రీసద్గురుపాదపూజ, సత్సంగ సమావేశం, భక్తసమారాధన. రాత్రి 7గం.లకు జ్వాలాతోరణం, శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి నగరోత్సవం.

9 ఆది నుండి 17 సోమ వరకు : శ్రీ గురుదేవుల షట్‌వింశతి (26వ) పుణ్యారాధన మహోత్సవాలు పంచ యజ్ఞ విధులతో జరుపబడును. ది. 9-11-2014 ఆదివారం ఉదయం శ్రీమాతాజీవారిచే సప్తాహ్నిక దీక్షా స్వీకారము; రాత్రి శ్రీ సద్గురుదేవుల పుణ్యారాధన.

<u>నిత్య కార్యక్రమాలు</u> 9-11-14 నుండి 17-11-14 వరకు

ఉదయం 4గం.లకు మేలుకొలుపు (సుప్రభాతం); 5గం.ల నుండి ప్రార్థన, మహామంగళ హారతి; 6గం.లకు బ్రహ్మ శ్రీ కొండూరి రామ బ్రహ్మంగారిచే వేదపఠనము; ఆలయ దర్శనము, తీర్థ ప్రసాదములు; 6-30ని॥లకు శ్రీ సద్గురుపాదుకా ప్రదక్షిణము; 8 గం.లకుశ్రీ గురుగీతా ప్రవచనము - ప్రవాచకులు శ్రీజపమాలా ప్రసాద; 9గం.లకు 10-11-2014 నుండి సత్సంగ సమావేశాలు - శ్రీ మాతాజీ వారిఅనుగ్రహ భాషణము, భక్తులచే ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయి.శ్రీ సద్గురుదేవుల దర్శనం(వీడియో); శ్రీబాబూజీ వాడిన వస్తువుల ప్రదర్శన (మ్యూజియం)

మధ్యాహ్నం 2గం.లకు శ్రీసద్గురు శత సహస్రనామార్చన, మహామంత్ర పుష్పం, దర్బారు. సాయంత్రం 5గంలకు శ్రీమాతాజీవారు తీర్థమిస్తారు. అనంతరం భక్తసమారాధన. 6గం.లకు ప్రార్థన, మహామంగళ హారతి. ప్రతిరోజూ అఖండ హరినామ సంకీర్తన. అఖండ పారాయణ, అఖండ ధ్యానము, కోటి సద్గురు నామ పారాయణ.

16-11-14 ఆదివారం శ్రీగురదశమి, శ్రీసద్గురుపాదపూజ

17-11-14 సోమ, తె.జా 3గం.లకు శ్రీగురుదేవులకు బృందావనంలో నమక, చమక సహిత మహాభిషేకం. నిత్యపూజ అనంతరం దీక్షా విరమణ

విశేష కార్యక్రమాలు

9-11-14 ఆదివారం రాత్రి 7గం.లకు శ్రీసద్గురుదేవుల పుణ్యారాధన.

15-11-14 శనివారం రాత్రి 7గం.లకు ఊంజల సేవ. (డోలోత్సవం)

16-11-14 ఆదివారం శ్రీగురుదశమి.

ఉదయం 7గం.లకు శ్రీసద్గురుదేవుల సామూహిక సద్గురుపాదపూజలు. సాయంత్రం ప్రార్థనానంతరం దీపోత్సవం. అనంతరం శ్రీసద్గురుదేవుల పుణ్యారాధన.

17-11-2014 సోమవారం తెల్లవారుజామున 3గం.లకు శ్రీ సద్గురు దేవులకు రుద్ర నమక చమక సహిత మహాభిషేకము. ఉదయం 5గం.లకు ప్రాతఃకాల నిత్యపూజ అనంతరం దీక్షావిరమణ. సాయంత్రం 6గం.లకు నగరోత్సవం అనంతరం తెప్పోత్సవం. (నౌకావిహారం)

20 గురు : మాసశివరాత్రి

22 శని : అమావాస్య

28 శుక్ర : శ్రీ సుబ్రహ్మణ్య షష్ఠి, స్వామికి అభిషేకము, సహస్రనామార్చన

డిసెంబర్ 2014

2 మంగళ గీతాజయంతి, గీతాపారాయణ.

3 బుధ శ్రీసద్గురుదేవులు స్వస్వరూపలయం పొందిన తేది. శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

6 శని పూర్ణిమ. దత్తాత్రేయ జయంతి. శ్రీసద్గురుపాదపూజ.

7 ఆది శ్రీసద్గురుదేవులు మహాసమాధిలో ప్రవేశించిన తేది. శ్రీసద్గురు పాదపూజ

16 మంగళ శ్రీగురుదశమి. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగసమావేశము. ధనుర్మాసకార్యక్రమాలు ప్రారంభం.

ఉదయం 9-30ని॥లకు సంకీర్తన, 10గం.లకు తిరుప్పావై, 10-30ని॥ ఋషుల చరిత్ర, 11గం.లకు భాగవత ప్రవచనము, సత్సంగము, తీర్థ ప్రసాద వితరణ.

20 శని మాసశివరాత్రి., శని త్రయోదశి.

22 సోమ అమావాస్య

25 గురు క్రిస్మస్ శ్రీసద్గురుపాదపూజ, సత్సంగ సమావేశము.

# పరి ప్రశ్నేన సేవయా

– పరాశర ప్రసాద్

“దూషణ భూషణలు కర్మబంధాలకి దారి తీస్తాయి. మానవుడు ఎన్ని ప్రగల్భాలు పలికినా, విధి నిర్ణయానికి దాసుడే సుమా! జరుగవలసినది జరిగే తీరుతుంది. జరగ కూడనిది ఎంత ప్రయత్నించినా జరగదు.” అని బోధించిన సద్గురుదేవుల బోధని పురస్కరించుకుని



ఒక సందేహం జనించిన భక్తునికి సమాధానంగా “విధి నిర్ణయాన్ని బ్రహ్మ విష్ణు మహేశ్వరులు కూడా తప్పించలేరు దానిని నివారించ గల సమర్థత సద్గురు మూర్తికి మాత్రమే ఉంది. గీతాచార్యుడు సెలవిచ్చినట్లు ‘జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం’ అన్నట్లుగా జ్ఞానం ఎటువంటి కర్మనైనా దగ్ధం చేయ గలుగుతుంది. కాని మీ హృదయ బాబు ‘ధ్యానాగ్ని దగ్ధ కర్మాణం’ అంటున్నాడు. నీకు ప్రసాదించిన లక్ష్యార్థంపై మనస్సు నిలిపి ధ్యానిస్తే దాని ద్వారా ఉద్భవించిన ధ్యానాగ్ని ఎటువంటి కర్మనైనా దగ్ధం చేయగలుగుతుంది. ఇది మాత్రం సత్యం. ఇక్కడ మీకు ఒక ఉదంతం చెబుతాను.

రావణాసురుడు మహాపండితుడు. అన్ని విద్యలలోనూ ఆరితేరిన వాడు. భక్తుడు. దేవతలను మెప్పించి వరాలను పొందాడు. సకల శాస్త్ర పారంగతుడు. నమకం చమకం రచించాడు. మహాతపస్వి. అట్టివాడు కామ ప్రలోభియై సీతామాతను అపహరించి వివాహమాడ ప్రయత్నం చేశాడు. రావణాసురుని భార్య మండోదరి భక్తురాలు. శీలవతి. తన భర్తతో సంభాషణ చేస్తూ ‘మీరు అన్ని మాయలను జయించిన శక్తి సంపన్నులు కదా! మరి సీతను వరించటానికి రామ వేషధారియై ఎందుకు వెళ్ళకూడదు?’ అని ప్రశ్నించింది.

దానికి రావణాసురుడు సమాధానం చెబుతూ ‘శ్రీరామ చంద్రుడు గుణరహితుడు. నిరాకారుడు, నిర్వికారుడు. సాక్షాత్తు

శ్రీమన్నారాయణుడే! సగుణ బ్రహ్మయై అవతరించాడు. అట్టి గుణ రహితుని రూపధారణ చేస్తే కామ క్రోదాధి గుణాలు ఎక్కడ ఉంటాయి? సుందర రూపధారణ చేస్తే ప్రేమేగాని, వికారం ఉండదు' అంటాడు.

అది విన్న మండోదరి తిరిగి ప్రశ్నిస్తూ 'ఇంతటి జ్ఞానియైన మీకు ఈ కామ వికారం ఎందుకు కలిగింది?' అని అడిగింది. రావణాసురుడు సమాధానం చెబుతూ 'విధి వ్రాత అనేది దేవరహస్యం' అన్నాడు.

రావణాసురునికి కామ వికారం కలిగితేగాని ముక్తిని ప్రసాదించటం సాధ్యం కాదు. దీనిని మీరు అర్థం చేసుకోండి చాలు" అన్నారు శ్రీగురుదేవులు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు అయిన అజ్జరపు వీరభద్ర రావుగారు (A.V. RAO)గారు 18-10-14 శనివారం నాడు శ్రీగురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 90 సంవత్సరాలు.

శ్రీ సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరు కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, భాగ్యనగరవాసులు అయిన శ్రీమతి వారణాసి పద్మావతిగారు (వి.భానుప్రసాద్ ధర్మపత్ని) 18-10-14 శనివారం నాడు శ్రీగురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 44సంవత్సరాలు.

శ్రీ సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరు కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

(గత సంచిక తరువాయి) **సద్గురు శ్రీ యాత్రా దర్శన్** -పి. సుధారాణి

8-5-2014

ఉదయం కుర్ఫీ అనే బాగా ఎత్తైన ప్రదేశానికి గుఱ్ఱాలపై వెళ్ళాము. బాగా చలిగా ఉంది. సాహస క్రీడలు ఉన్నాయి. త్రాడు (**Roap Way**) ప్రయాణం చేసి, అవతల కొండపై ఉన్న హనుమంతుని ఆలయం దర్శనం చేసుకుని, తిరిగి గుఱ్ఱాలపై ప్రయాణం చేసి క్రిందకి వచ్చాము. భోజనం చేసి బసకు చేరుకున్నాము. చాలామంది వాంతులు, విరేచనాలు, జ్వరముతో బాధ పడినా గురుదేవులు వారిని త్వరగా కోలుకునేలాగ అనుగ్రహించి యాత్రకు భంగం కలుగకుండా చేశారు.

9-5-2014

ఉదయం చల్లగా తాపంలేని ఎండలో అమ్మతో సరదాగా కొంతసేపు గడిపి ఫలహారం చేసి, కులూమనాలీకి బయలుదేరాము. రాత్రి 10-30 ని॥లకు హొటల్ మనాలీ పేలస్‌లో బసకు చేరుకున్నాము.

10-5-2014

ఉదయం 8గం.లకు గులాబ్ పాస్‌కి బయలుదేరి వెళ్ళాము. రోతంగ్ పాస్ వద్ద మంచు ఎక్కువై రోడ్డు క్లియర్‌గా లేనందు వల్ల అక్కడి వరకు వెళ్ళలేక పోయాము. గులాబ్‌పాస్ వద్ద మంచుకొండలు. పూర్తిగా పైదాక వెళ్ళలేక పోయాము. ట్రాఫిక్ జామ్ అయింది. పిల్లలు ట్రెకింగ్ చేసి కొండల పైదాకా వెళ్ళి సరదాగా గడిపి వచ్చారు. తిరిగి బసకు వచ్చాము. భోజనం చేసి సాయంత్రం హిడింబి ఆలయానికి వెళ్ళాము. రాక్షస జాతిలో జన్మించిన హిడింబి అక్కడ తపస్సుచేసి దుర్గామాత అయింది. గుడిలో రాతిపై అది పెద్ద పాదపు అచ్చు ఉన్నది. రాత్రికి భోజనం చేసి విశ్రమించాం.

11-5-2014

తెల్లవారుజామున 4గం.లకు బయలుదేరాము. ఉదయం 6గం.లకు ఒక శాలువ ఫ్యాక్టరీ చూసి, ఫలహారం చేసి మధ్యాహ్నం 3గం.లకు నయనదేవి ఆలయం చేరుకున్నాము. శివాలిక్ కొండలపై, ఆనందపూర్ సాహెబ్ అను ప్రముఖ రైల్వే స్టేషన్ వద్ద ఉన్నది. రోప్‌వేలో కొండపై ఆలయం చేరాము. చాలా పెద్దది. చాలా మెట్లు ఎక్కి అమ్మవారిని దర్శించాం.

సతీదేవి కళ్ళుపడ్డ శక్తిపీఠం. అందమైన కళ్ళు కాంతులీనుతుండగా పిండి రూపంలో ఉన్న జగదంబ ఆశీర్వచనం తీసుకుని తిరిగి బయలుదేరాము. ప్రముఖ భాక్రానంగల్ డామ్ మరియు రైల్వేలైన్ దీనికి అనుబంధంగా ఉన్నది.

స్థలపురాణం -

శివాలిక్ కొండలపై గోపాలురు ఆవులను గడ్డికోసం తీసుకుని వెళ్ళేవారు. నయ అనే గోపాలుని ఆవు ఒక రావిచెట్టు క్రింద నిలబడి పాలను ధారగా ఒదిలేది. (శ్రీ వేంకటేశ్వరుని చరిత్ర వలె) గోపాలునికి అనుమానం వచ్చి చెట్టుక్రింద వెతికి చూస్తే ఆకుల క్రింద పిండి (రాయి) రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు.

అదే రాత్రి ఆ గోపాలునికి అమ్మవారు కలలో దర్శనమిచ్చి తనకు ఆలయం నిర్మించమని ఆదేశించగా, భక్తుడైన ఆ గోపాలుని పేరుతోనే అమ్మ నయనదేవిగా వెలిసింది.

తదుపరి అమ్మ మహిమలు అమితంగా అకర్షించగా, భక్తులు అనేక విరాళాలు పోగుచేసి, అద్భుతమైన ఆలయం నిర్మించారు. దగ్గరలో నయనదేవి గుహ కూడా ఉన్నది.

కొండపై నుండి తిరిగి రోప్‌వేలో వచ్చి సాయంత్రం 4గం.లకు భోజనం చేసి బయలుదేరాము. కొంత దూరంలో భాక్రానంగల్ డామ్ చూశాము. భారత దేశం గర్వించదగ్గ విద్యుదుత్పాదన మరియు అనేక ఎకరాల పంట సాగుచేయగల నీటి పారుదలగల అతి పెద్ద డామ్ అది.

అక్కడి నుండి తిరిగి ప్రయాణం చేసి, రాత్రి 10గం.లకు చింతలను దూరం చేసే చింతాపూర్ణి చేరాము. అక్కడ చలి తక్కువగానే ఉన్నది. భోజనం చేసి అక్కడ విశ్రాంతి తీసుకున్నాము.

-సశేషం

సమర్థసద్గురు మాసపత్రికకు సభ్యులుగా చేరండి! చేర్చండి! మీ సభ్యత్వం ముగిసే తేదీ ఎడ్రస్ కూపన్‌మీద ఉంటుంది. దాని ప్రకారం మీ సభ్యత్వాన్ని సకాలంలో పునరుద్ధరించుకోండి!

# భక్త మార్కండేయ

- కామేశ్వరీ ప్రసాద

భృగువంశంలో విధాత, నియతి దంపతులకు చాల కాలం సంతానం కలగకపోవటంతో తీవ్ర తపమచారించగా శివుడు ప్రత్యక్షమై వారికి సకల సుగుణాభిరాముడ్డైనవాడు, పరమ భక్తుడు, అల్పాయుష్కుడు పుత్రునిగా జన్మిస్తాడని వరమిచ్చి అదృశ్యమైనాడు. పుత్రను వరంగా పొందగలిగామని సంతోషం ఒక ప్రక్క, అల్పాయుష్కుడైనందుకు విచారం మరోప్రక్క కలిగి, విధివిధానం ఇలా ఉంది కదా! అని వారు మౌనంగా ఉండిపోయారు.

కొంతకాలానికి నియతి గర్భాన్ని ధరించి మార్కండేయుని ప్రసవించినది. తల్లిదండ్రులు ఆ పిల్లవాని ఎంతో అల్లారు ముద్దుగా పెంచుతూ, ఆ పిల్లవాడిని చూడటానికి వచ్చిన మహర్షులందరికీ ఎత్తుకోమని ఆ పిల్లవాడిని చేతికి అందించి వారిచేత 'చిరంజీవ!' అని ఆశీర్వచనం తీసుకుంటూ ఉండేవారు.

కొంతకాలం గడిచాక ఒకనాడు తల్లిదండ్రులు బాధపడుతుంటే చూసి, మార్కండేయుడు 'ఎందుకు మీరు దుఃఖిస్తున్నారు?' అని వారిని ప్రశ్నించాడు. దానికి వారు ఎంతో దీనంగా 'నాయనా! నీవు మా కడుపున జన్మించటము మాకు సంతోషమే! కానీ నీవు అల్పాయుష్కుడవు. 16 సంవత్సరములు మాత్రమే నీకు ఆయుర్దామున్నది అని పరమేశ్వరుడు సెలవిచ్చాడు. మరి ఇక మాకు దుఃఖము కాక మరేమున్నది?' అని అసలు విషయమును తెలియబరచారు.



అది విని మార్కండేయుడు వారిని ఓదారుస్తూ 'జననీ జనకులారా! మీరు మహానిష్ఠతో తపస్సు చేసి, భగవదనుగ్రహంతో నాకీ దేహాన్ని ప్రసాదించారు. నాకీ దేహాన్ని శాశ్వతం చేసే ఉపాయాన్ని ఈశ్వర ఆరాధాన చేసి, జనన మరణరూపమ్మై, సుఖదుఃఖాలకు ఆలవాలమైన పునరపి జననం పునరపి మరణం కలిగించే ఈ శరీర దృష్టిని పరమేశ్వరుని యందు నిలిపి శాశ్వత సుఖాన్ని పొంది తిరిగి వస్తాను. నన్ను దీవించండి" అన్నాడు.

మార్కండేయుడు శివాలయంలోకి ప్రవేశించి, శివలింగాన్ని కౌగలించుకుని, శరీరము కదలక, మనస్సు నిశ్చలం చేసి, శివునే అవలోకనం చేస్తూ తపస్సులో మునిగిపోయాడు. ఇంతలో పదహారవ ఏడు వచ్చింది. మృత్యు ఘడియలు సమీపించాయి.

-సశేషం

# నియమిత వేళలలో తప్పక ప్రార్థన చేయాలి

ఆంధ్రప్రదేశ్‌లోని చికాకోల్‌లో ఖాదీ ప్రచారానికై గాంధీగారు, కాలేల్కర్, మహాదేవ దేశశాయి పాల్గొన్నారు. గాంధీగారు వచ్చారని ఆ ఊర్లో కదురు వడకటంలో పోటీలుకూడా ఏర్పాటు చేశారు. మోటారు సైకిల్ మీద ప్రయాణం చేసిచేసి ఉండటం చేత అలసిపోయిన వీరు ఆ పోటీప్రదర్శనలో పాల్గొన లేకపోయారు. కానీ గాంధీగారికి తప్పలేదు.

ఆ రాత్రి గాంధీగారు ఎప్పుడు పడుకున్నారో ఎవరికీ తెలియదు. ప్రొద్దుట నాలుగు గంటలకు అందరూ ప్రార్థనకై నిద్ర లేచినప్పుడు, గాంధీ గారు వారిని "రాత్రి నిద్రపోయే ముందు మీరు ప్రార్థన చేసుకున్నారా?" అని అడిగారు.

"పడక మీద చేరేసరికి అలసట వల్ల బాగా నిదుర పట్టేసింది. ప్రార్థన చేసుకోవాలని అసలు జ్ఞాపకమే రాలేదు" అని కాకాసాహెబ్ జవాబు చెప్పారు.

"నేను బాగా అలసిపోయాను. కండ్లు మూతపడుతుండగా జ్ఞాపకం వచ్చింది. అందుకని ప్రక్కమీదనే కూర్చుని చేసుకున్నాను" అని మహాదేవదేశాయి జవాబిచ్చారు.

"నేను గంటన్నర సేపు పోటీ చూస్తూ కూర్చున్నాను. అక్కడ నుంచి వచ్చేసరికి బాగా అలసిపోయానేమో వెంటనే నిద్రపట్టేసింది. రాత్రి 2గం.లకు మెలకువ వచ్చినప్పుడు జ్ఞాపకం వచ్చింది. అప్పుడు కలిగిన బాధతో శరీరం కంపరమెత్తిపోయింది. చమటలు పట్టాయి. లేచి కూర్చున్నాను. చాలా పశ్చాత్తాప పడ్డాను. ఏ భగవంతుని దయవలన జీవిస్తున్నానో, ఏ భగవంతుడి కోసం జీవత సాధన చేస్తున్నానో, ఆ భగవంతునే మరచిపోయాను! ఎంత పెద్ద తప్పు చేశాను! అని ఆ తరువాత భగవంతుని క్షమాభిక్ష వేడుకున్నాను. కానీ నిద్ర పట్టలేదు. ఇక అలాగే కూర్చుండిపోయాను" అన్నారు మహాత్మా గాంధి.

"మనం ఇక నుంచి ఎక్కడ ఉన్నా, ఏం చేస్తున్నా సరే నియమిత సమయంలో రాత్రి 7గం.లకు యీ రోజు నుంచి ప్రతిరోజూ సాయంత్రం ప్రార్థన జరుగుతుంది" అన్నారు. ఆ తరువాత నుంచి వారు ఎక్కడున్నా, అడవిలో ఉన్నా, మోటారు మీద ప్రయాణం చేస్తున్నా సరే ఆపివేసి ఆ సమయానికి ప్రార్థన చేసేవారు.

# సులభమా! మాకు సులభమా!

-పెనుమాక నాగేశ్వర రావు

సులభమా! మాకూ సులభమేనా మిము కనుగొన స్వామీ!
సులభమా మాకు సులభమేనా.........
పొదులోపలి ఆశలు, ఎదలలోపలి ఊహలూ,
తీగసాగిన కోర్కెలు, వేరులూరిన వాంఛలూ వదలి
మిము కనుగొన సులభమా.... మాకు సులభమేనా

ఇష్టమేదో, నష్టమేదో, మిగులుడేదో, తగులుడేదో తెచ్చినదెంతో, ఇచ్చినదెంతో
మిగిలినదెంతో, మింగినదెంతో, మునిగినదెంతో, ముంచినదెంతో
ఏదిఎంతో, ఎందుకెంతో, ఎక్కడెంతో, ఎవరికెంతో, ఎప్పుడెంతో, ఎక్కడెంతో
ఈ పిచ్చిపిచ్చి లెక్కలెన్నో, అవితెచ్చిపెట్టే చిక్కులెన్నో విప్పుకుని....
మిము కనుగొన సులభమా..... మాకు సులభమేనా

ఉట్టిగ ఉండలేక ఉట్టికెక్కలేక స్వర్గానికి నిచ్చెనలేస్తూ
ప్రతి పొద్దూ పడుతూ లేస్తూ, నవ్వలేక ఏడ్చేస్తూ, ఏడ్వలేక నవ్వేస్తూ
వేధించే వేదనలు, బాధించే బంధనలు, మూటకట్టిన పాపాలు,
ముందుకొచ్చే శాపాలు, ముప్పు తెచ్చే కోపాలు, ముసురుకొచ్చే రోగాలు తప్పుకుని
మిము కనుగొన సులభమా.... మాకు సులభమేనా!



(గత సంచిక తరువాయి) **ధ్యానం - మాధవ స్థితి (1)** - రేఖ

గురువనుగ్రహం అందరికీ ఉంది. భగవంతుడు సర్వవ్యాపకుడు. ఆ శక్తిని అనుభవించే హక్కు ప్రతి మానవుడికీ ఉంది. నేను ధ్యానం చేస్తున్నాను అనే విషయం మరచిపోయి సర్వత్రా వ్యాపించి ఉన్న శక్తిని వెలికి తీస్తే ఆనందం. మహాత్ములు చెప్పినట్లు చేస్తే రోజంతా కూడా మనకి ఎంతో ఆనందంగా, తృప్తిగా, శాంతిగా వుంటుంది. శాంతి పొందటానికి అందరూ అర్హులే! జగత్తులో ఎవరి స్వధర్మం వారు పర్‌ఫెక్ట్‌గా చేస్తే. ఎందుకంటే గీతలో 'శ్రేయాన స్వధర్మో విగుణః పరధర్మాస్వనుష్ఠితాత్' అని సెలవిచ్చాడు పరమాత్ముడు. బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమం, వానప్రస్థం, సన్యాసం దీనిలో ఏ ఆశ్రమంలోనైనా ఉండు. మానసిక ప్రవృత్తిని మార్చుకో అదే మాధవస్థితి!

ప్రపంచంలో ఆలయాలు చాల కట్టేస్తారు. ఆ గుడి కట్టినప్పుడు ఉండే ఆవేదన, ఆతృత, కట్టిక కొన్నిరోజులకి తగ్గిపోతుంది. తరువాత తీరిక లేదని, డబ్బు లేదని వాటిని మెయింటెయిన్ చేయటం అశ్రద్ధ చేసి, శిథిలావస్థకు వచ్చేటట్లు చేస్తారు. ఈ మనస్సుతో కూడిన దేహమే ఒక దేవాలయం. దానిని శుభ్రపరచుకోవటానికి ఎంత కాలం కావాలి? పొందవలసిన దానికోసం ఆవేదన, ఆసక్తి, ఉండాలి. ఆకలి వేస్తే పదార్థం చూడము. మనక్కావల్సింది తింటాం. తీవ్ర ప్రయత్నం చేస్తే మన గమ్యం మనం తప్పక చేరతాము.

యోగః చిత్తవృత్తి నిరోధకః - కేవలం రేచ పూరక కుంభకాల ద్వారా శ్వాస నిలిపి, శ్వాస మీద దృష్టి నిలిపి చేసే ధ్యానం చాలదు. సక్రమంగా స్వధర్మ ఆచరణ, సమయాన్ని, ద్రవ్యాన్ని సద్వినియోగ పరచుకోవటం, సద్గురు సమాశ్రయం, గురూపదేశం, మహాత్ముల బోధ, లీలలు, సన్నిధి కావాలి. సోమరితనమే అజ్ఞానమని శ్రీగురుదేవులు శెలవిచ్చారు. కాబట్టి దాన్ని దరిచేరనీయకుండా నిరంతరం భగవన్నామ స్మరణలో, భక్తుల చరిత్రలు, సద్గురు బోధా శ్రవణం, ధైర్య సాహసాలు, వైరాగ్యం అనే సుగుణాలు అలవరచుకుని, భక్తితో జ్ఞాన సముపార్జన చేస్తే మన స్వరూపం రూపనామ క్రియా రహితమైన ధ్యానమే. గురువు అనుగ్రహం తనలోనే ఉంది. అది గుర్తిస్తే మరి యిక తిరుగులేదు. భావన

మార్చుకో సద్భావన పెంచుకో అని శ్రీమాతాజీ ఉద్బోధిస్తూ 'సాధకుడు తన దీక్షను తనే తీసుకుని పట్టుదలతో పరీక్షిత్తు మహారాజులా ముందుకు వెళ్ళాలి' అని హెచ్చరించారు.

ముకుందమాలలోని శ్రీకులశేఖరాళ్వార్ వారి భక్తి తత్పరతని బోధిస్తూ 'కృష్ణత్వదీయ పదపంకజ....' అనే పద్యం పాడి మనసనే రాజహంసను నీ పాదపద్మములయందు యిప్పుడే బంధించి వేయి. ఈ స్మరణ మరవకుండా ఉండటానికి. మరణకాలమందు కఫవాత పిత్తములు కంఠములో అడ్డుపడి, నీ స్మరణ చేయలేనేమో అందుకని యిప్పుడే యీ మనస్సుని కట్టిపడివేయి అని ప్రార్థిస్తారు. ఆ విధంగా సాధకుడి ఆవేదన ఉండాలని హెచ్చరించారు. జగత్తు మారిపోయేది. మారనిది నీలోనూ సర్వత్రా ఉంది. అదే మహాశక్తి, గురుశక్తి, భగవత్ శక్తి అని గుర్తిస్తే అది యూనివర్సల్ లవ్ అని గుర్తిస్తావు. అది ఆనందదాయకం. అప్పుడు శత్రువులే ఉండరు. ఎందుకంటే భగవంతుడు, సమస్త సృష్టి ఆ శక్తి నుండే వచ్చింది.

ప్రపంచమందు ఒక అవగాహన ఉంటే ఎవరూ మనకు శత్రువులు కారు. అది లేకపోతే అశాంతే. విచారణ ద్వారా మనస్సు సమాధన పడుతుంది. అప్పుడు భగవంతుడు ఎక్కడ లేడు అన్న సత్యం అవగత మవుతుంది. భగవంతుడు మానవుడు ఉపయోగించటం కోసమే యీ ప్రపంచాన్ని సృష్టించాడు. అనవసరమైనవి వదలిపెట్టి, ఎంతవరకూ అవసరమో అంతవరకే గ్రహించాలి. ప్రపంచ విషయాలైనా, వస్తువులైనా అన్నీ మనకే కావాలనుకో కూడదు. దైవ గుణాల్లో ముఖ్యమైనటువంటి తితీక్ష, శ్రద్ధ, కోపము లేకుండుట, దయ, అహింస, త్యాగం, అంతఃకరణ శుద్ధి, కొండెములు చెప్పకుండుట, దైవసంబంధ కార్యములు చేయుట, గురుసమాశ్రయము, శాంతి, మృదుత్వము, అందరిలో మంచినే చూచుట, సత్యము పలుకుటవంటివి సత్వగుణ ప్రధానమైనవాటిని అలవరచుకోవాలి.

శ్రీగురుదేవులు మనకి ఎందుకు ఆశ్రయం యిచ్చారు? వారికి మనతో అవసరం లేదు. మనం యింకొకరి దుఃఖాన్ని పోగొట్టలేము. కానీ గురువులు మనస్సును అదుపులో పెట్టుకునే మార్గం చూపిస్తారు. ఎందుకు తడబడతావు? అని ధైర్యం చెప్పి, నీ స్వరూపం మారనిది,

ప్రపంచంలోని తళుకుబెళుకులను చూసి ఆకర్షింపబడి పోకుండా, వాటి వెనుక ఉన్నవాటిని గుర్తించు. మనస్సు బాగోనప్పుడు మనకి మామూలుగా సంతోషాన్ని సుఖాన్ని యిచ్చే వస్తువుగాని, విషయంగాని తాత్కాలికంగా కూడా ఆనందాన్ని యివ్వలేవు.

జగత్తు జాడ్యంలో మునిగిపోయి ప్రశాంత వాతావరణం కరువయిపోతోంది. ఎల్లవేళలా కూర్చుని ఉండటం ధ్యానం కాదు. మహాత్ములు ప్రశాంత వాతావరణంలో తపస్సు చేస్తూ అక్కడే ఉండి పోలేదు. తిరిగి ప్రపంచంలోకి వచ్చి మానవులకి మార్గదర్శకులు అయ్యారు. మన స్వరూపం ధ్యానం. దేహమనే దేవాలయం ఒక మందిరం. అది భగవంతుడి సృష్టి. ఆయనే అన్నీ అమర్చి పెట్టాడు. మనసనే దానిని యిచ్చి, భావన ద్వారా మన చుట్టూ ఉన్న వాతావరణాన్ని ప్రశాంతంగా మార్చుకోవాలి. ఏకాగ్రతతో ప్రతిచర్య ఉంటే మనస్సు నిలబడుతుంది. మహాత్ములు ఆవిధంగా తమ తపశ్శక్తితో ఎల్లవేళలా, ఏ చోటనైనా ప్రశాంతత ఏర్పరచుకోగలిగారు. మానసిక ప్రవృత్తి మారితే అదే మాధవ స్థితి!



పాలను, వెన్నయు మ్రుచ్చిల
రోలను మీ తల్లి గట్ట। రోషముతోడన్
లీలావినోది వైతివి
బాలుఁడవా బ్రహ్మగన్న। ప్రభుఁడవు కృష్ణా!

తాత్పర్యము -
ఓ కృష్ణా! పాలు, వెన్నలను నీవు దొంగిలించగా నీ తల్లి కోపించి, నిన్ను రోటికి కట్టగా నీవు అది ఒక లీలా వినోదముగా ఎంచితివి. నీవు బ్రహ్మదేవుని గన్న లోక ప్రభువు కానీ, పిల్లవాడవు కాదు సుమా!

- శ్రీకృష్ణ శతకము 84

గత సంచిక తరువాయి

# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

ఇవాళ పిల్లవాడు వీధి గుమ్మానికి ఎదురుగా పెరట్లో మట్టి ముద్దలు చేస్తూ కనిపించాడు. అటే చూస్తూ నిలబడింది ముత్తవ్వ. అవ్వని చూసి రెండు చేతులతో మట్టి ముద్దలను పట్టుకుని వచ్చాడు. చేతులు, ఒళ్ళు అంతా మట్టి. తల్లి లోపల ఏ పనిలో ఉందో పిల్లవాడిని గమనించి నట్లు లేదు. నవ్వుతూ కళ్ళు కదుపుతూ తన వంకే వస్తున్న పిల్లవాడిని చూస్తూ అవ్వకి ఒళ్ళు తెలియటం లేదు. తన కళ్ళలోకి అమృతం పోసి నట్లుగా ఉంది.

"ఈ తీయని పండ్లు తిను నాయనా!" అంటూ అవ్వ కన్నయ్య నోటికి పండు అందించింది. గుటుక్కున మింగేశాడు. "అయ్యో! అందులో గింజ ఉంది ఊసేయాలి. కానీ మింగేస్తే గింజ పొట్టలోకి వెళ్ళి!!" అంటూ తన చిన్నతనంలో పెద్దవాళ్ళెవరో 'గింజను మింగితే ముక్కులో నుంచి, చెవుల్లో నుంచి చెట్లకొమ్మలు బయటకి వస్తాయి' అనటం గుర్తువచ్చింది అవ్వకి. అవ్వ ఆలోచనలు, మాటలు అలా ఉండగానే, ఎదుట నిలబడిన పిల్లవాడు



ఎంతో ఎదిగిపోయి కనిపించాడు. చేతుల్లో మట్టి బంతులు బ్రహ్మాండాలై గిరగిరా తిరుగుతున్నాయి. పొట్టలో నుంచి చెట్లు చేమలు, పుట్టలు, నీళ్ళు, గట్లు, ఆకాశం, సూర్యచంద్రులు, నక్షత్రాలు, ఒకటేమిటి! విశ్వం అంతా కనిపిస్తోంది! ముత్తవ్వ నోరు తెరచుకుని అలాగే ఉండి పోయింది. కనులు మూతపడటం లేదు. మాట రావటం లేదు. ఆమెకి తెలియనిది ఏదో తెలుస్తోంది ఆ స్థితిలో.

సమస్తమును సృష్టించిన జగత్ ప్రభువు వీడు! ఆమెలో ఆనందం తరంగాలై విజృంభించింది. ఆమెని ముంచెత్తుతోంది. నేలమీద వాలి పోయింది అవ్వ. తల్లి అప్పుడే అక్కడకు వచ్చింది. 'అవ్వా! కళ్ళు తిరిగి పడిపోయావేమిటే! తిండి తిప్పలు తినలేదా?' అంటూ యశోద లేపి కూర్చోబెట్టి, ముందు ఈ మజ్జిగ త్రాగు అంటూ ఇచ్చింది అవ్వకు. మజ్జిగ త్రాగి, పండు తిని, 'పిల్లవాడు....'అంటూ ఏదో చెప్పబోయింది. 'అదిగో! తోటి పిల్లలు వచ్చారు. వారితో పెరట్లో ఆడుతున్నాడు. పళ్ళు వాళ్ళందరికీ నేను ఇస్తానులే. నీవు కాస్త తేరుకునే వరకు ఇక్కడే ఉండి, ఇక్కడే అన్నం

తిని నడుము వాల్చుకో' అన్నది యశోద.

కళ్ళు మూసినా తెరిచినా అవ్వకు తాను చూసిన దృశ్యమంతా కనబడుతూనే ఉంది. ఎవరినో పిల్లవాడిని తోడిచ్చి పంపింది. దారిలో ఆ పిల్లవాడు చెప్పాడు అవ్వకు ఆమె పేరు యశోద అని, ఆ పిల్లవాడి పేరు కన్నయ్య అని. తెల్లవారింది సూర్యుడు వచ్చి సాయంత్రం వెళ్ళిపోయాడు. రాత్రి చంద్రుడు వచ్చి పాకలో చివరగా బొంతమీద ముడిచిపెట్టుకు పడుకున్న అవ్వను, పాకలోని కప్పుపైన వెదురుబద్దల సందులో నుండి తొంగి చూస్తూ తనకి ఏమైందంటూ అడుగుతున్నాడు. మాటలలో చెప్ప లేని ఆనందానుభవం అది. కళ్ళు మూసుకున్న అవ్వకు ఎవరో వచ్చి తన ప్రక్కలో కూర్చున్నట్లు అనిపించింది. కళ్ళు విప్పి లేవబోయింది.

రెండు చేతులు ఆమెను చుట్టి కౌగలించుకుంటున్నాయి. ఎవరు? ఎవరని? చుట్టూ చీకటిని చీలుస్తూ గొప్ప వెలుగులో లీలగా కనిపించిన ఆ మూర్తిని చూస్తూనే గుర్తుపట్టింది కన్నయ్య అని. మాట పెగలలేదు అవ్వకి. చూస్తున్నంతలో ఆ రూపం మారింది. తలమీద నెమలి పింఛం, మెడలో హారాలు, కాలికి అందెలు లేవు. తలపైన జటలు, చేతిలో విల్లుబాణాలు, పాదాలకు పాదుకలు, ఒంటికి చుట్టిన నారచీరలు, ఎప్పుడో, ఎక్కడో చూసిన గుర్తువస్తోంది అవ్వకు. సరిగా తెలియటం లేదు అవ్వకి.

"నేను అవ్వా! యశోదా నందనుడిని, అలనాటి దశరథ తనయుణ్ణి. ఋషులందరినీ దర్శించటానికి అడవులలోకి వచ్చిన అయోధ్య రాముణ్ణి" అవ్వ కళ్ళల్లో అలనాటి కథంతా కదులుతోంది. "నువ్వు ఋషివాటికలో పుట్టి పెరిగిన లేడి కూనవు. వారంతా విచారణ చేసే పరతత్త్వాన్ని నువ్వు శ్రవణం చేసిన ఆత్మజ్ఞానివి. నేను మునులు అందరినీ చూస్తున్న సమయంలో నా పాదాలు వదలక వెంట వెంట తిరుగుతూ వచ్చావు. వాళ్ళంతా ఆనాడు కోరిన విధంగా నాతో ఆత్మరతి సలపటానికి గోపికలై ఇక్కడ జన్మించారు. నువ్వు నోరు లేని జీవివి కనుక నీ మనస్సు తెలిసి నిన్ను అనుగ్రహించి నంద గోప బాలునిగా నీకు చేరువై నీ జన్మను సఫలం చేశాను. పూర్వజన్మలో నువ్వు గ్రహించిన జ్ఞానం అంతా మూర్తీభవించి నీకు ఇప్పుడు బ్రహ్మానంద అనుభవాన్ని అందించింది. నువ్వు శాశ్వతమైన నా పదాన్ని అందుకో!" ఆ అవ్వ మళ్ళీ ఇక కనబడలేదు.

# ధ్యానం చేసే విధానం

- జి.వి

శ్రీబాబూజీ మహరాజ్ సత్తెనపల్లిలో జరిగిన సత్సంగ సమావేశంలో మాట్లాడుతూ "భగవంతుని నామ రూపాలపై నిరంతర ధ్యానం మనల్ని శాంతి, ఆనందాలు విలసిల్లే మహోన్నత స్థితికి తీసుకువెడుతుంది. దైవ ధ్యానం మనలో బ్రహ్మజ్ఞాన అగ్ని శిఖలను ప్రదీప్తం చేస్తుంది. ఈ అగ్ని శిఖలు గత జన్మలనుండీ పేరుకుంటూ వచ్చిన పాపకర్మలను, పునర్జన్మ బీజాలను భస్మీపటలం చేస్తాయి. ఈ ధ్యానం వలన ఆవిర్భవించే మహాకాంతి ఇక్కడ అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలుతుంది.



అల్లకల్లోలమైన సంసార జలధి తరంగాలపై మనిషి ఎటో కొట్టుకుంటూ పోతూ ఉంటాడు. మనల్ని కాపాడే శక్తి లేదా? అటువంటి రక్షణ శక్తి ఉన్నది. ఆ శక్తి సర్వమానకోటి పట్ల కారుణ్య వృష్టిని కురిపించే పరమాత్మ. ఆయన కృపా కటాక్షాలు మనలను సురక్షితంగా తీరాన్ని చేరుస్తాయి. శ్రీకృష్ణ పరమాత్మ దయచేత అర్జునుడు మమకార బంధాన్ని విచ్ఛిన్నం చేసి, తన చుట్టూ, తనలోనూ ఉన్న మహాశక్తులను జయించ లేదా? గీతాచార్యుని వంటి గురుకృప వల్ల మనం తప్పక సంసార సాగరం నుండి తరించ గలుగుతాము.

గురువు ఒక లక్ష్యార్థ సాధన మంత్రాన్ని శిష్యునకు ఇస్తాడు. సాధకుడు తదేక దృష్టితో ఆ మంత్రాన్ని జపిస్తాడు. ఈ పరివర్తనకు ముందు సాధకుడిని జీవుడు అంటారు. తరువాత అతను ఈశ్వరుడు అవుతాడు. సందేహాలు, కోరికలు, ద్వంద్వ దృష్టి ఉండదు. దీనితో భిన్నత్వం కూడా నశిస్తుంది. అది పరమ ప్రశాంత ఆనంద మయ స్థితి.

ప్రార్థన లేక ధ్యానం చేసే సమయంలో ఎవరైనా నిటారుగా ఆశీనులు కావాలి. చేతులు రెండూ కలిపి ఉంచాలి. ధ్యాన సమయంలో ఉద్భవించే అధ్యాత్మిక తరంగాలు వృథాకాకుండా, శరీరంలోనే ప్రవహించే

టట్లుగా అటువంటి స్థితి అవసరం. దీనికి మరొక మార్గం కూడా ఉంది. వ్రేళ్లను చిన్ముద్రలో ఉంచాలి. అంటే బ్రొటనవేలును చూపుడువేలుతో కలపాలి. మిగతా మూడు వ్రేళ్లను వదలాలి. జీవాత్మ (చూపుడువేలు)ను పరమాత్మ (బ్రొటనవేలు)తో సమైక్యం చేయటానికి మిగిలిన మూడు వ్రేళ్ళు (సత్వ రజ తమోగుణాలు)ను దూరంగా ఉంచటానికి ఈ ముద్ర సంకేతము.

ఈ ముద్రలో ఆసీనులమై మనం మనస్సును భగవంతుని పాద పద్మాలపైన కేంద్రీకృతం చేయాలి. తదేక దృష్టితో లక్ష్యార్థమంత్ర సాధన చేయాలి. అప్పుడు మనస్సు అవసరమైన వేగంతో జనరేటర్ లాగ పని చేస్తుంది. అప్పుడు మనస్సు నుండి ఆ శక్తి ఉద్భవిస్తుంది. ఈ శక్తితో ఎన్ని దీపాలనైనా వెలిగించ వచ్చు. ఎన్ని యంత్రాలనైనా నడుపవచ్చు. జనరేటర్‌ను తగినంత వేగంతో నడపటం ముఖ్యం. అంటే ఏకాగ్ర చిత్తం కావాలి.

ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. మంత్రాన్ని మనస్సులోనే జపించాలి గాని, బయటకు వినబడేటట్లు జపం చేయ కూడదు. పెదవులను కదిపి పైకి వినిపించేటట్లు చేయటం వలన శక్తి వృథా అవుతుంది. అంతేకాదు ఫలితాలను కూడా సాధించలేము. ఇంజన్ లోని ఆవిరిని వదిలివేస్తే అది శక్తిహీనమవుతుంది. అది ఇంజన్‌ను నడుప లేదు. భోగీలను అసలే కదపలేదు. పైకి జపం చేస్తే ప్రజలంతా విని చుట్టూ జేరతారు. దీనితో ధ్యానం దెబ్బతింటుంది.

మన ధ్యానం ఎవరికీ తెలియకుండా ఉంటే మంచిది. ఇది మనకూ పరమాత్మకూ మాత్రమే సంబంధించినది. కాని ఒక ప్రమాదం ఉన్నది. మౌన ధ్యానంతో మనం నిద్రకు ఉపక్రమించవచ్చు. అది కూడా ఒక సమాధి. తమోగుణ సమాధి. కాని మనకు కావలసిన స్థితి అది కాదు. నిశ్చలమైన వాతావరణంలో వెలిగే దీపం వలె, మన మనస్సు మంత్రంపై కేంద్రీకృతమై అచంచలంగా నిలవాలి.

అప్పుడు ఒక మనోజ్ఞమైన కాంతి కనిపిస్తుంది. అప్పుడు ప్రభవించే ఆనందం కవి ఊహకు కూడా అందనిది. ఆ విధంగా మనం ఒక్క పది నిమిషాలు ధ్యానం చేస్తే, నిద్రలేకుండా ఒక నెలపాటు అలాగే ఉండ గలుగుతాము. ఆహారం నిద్ర మనలను ఏ మాత్రమూ బాధించ లేవు. ధ్యానం ఎంత గొప్పదో మీరంతట మీరే గుర్తించుకోండి!

రుద్రాక్షమాల జపంతో ధ్యానాన్ని అంచనావేయటం తప్పు అని నా పరిశోధనలో తేలింది. మనస్సు పరిపరి విధాల పోకుండా ఏకాగ్రత సాధించటానికి రుద్రాక్షమాల తోడ్పడుతుంది. కాని మనం తదేక ధ్యానంలో మునిగి పోయినప్పుడు మాత్రం జపమాల త్రిప్పడం, పెదవుల కదలిక, మనస్సు నిశ్చల స్థితికి చేరుకున్నప్పుడు వాటి చలనం ఆగిపోతుంది. అదే భావ సమాధి. భావసమాధి వల్ల కలిగే ఆనందాన్ని మనస్సు ఒక్కసారి చవిచూస్తే అది ఐహిక భోగాలకై వెఱ్ఱిగా పరుగులెత్తదు. అటువంటి ఆనంద పారవశ్యాన్ని అర్థం చేసుకోవాలంటే దాన్ని అనుభవించాల్సిందే" అన్నారు శ్రీబాబు.



శ్రీరమ సీతగాఁగ। సేవక బృందము వీరవైష్ణవా
చార జనంబుగాఁగ విర। జానది గౌతమిగా వికుంఠము
న్నారయ భద్రశైల శిఖ। రాగ్రముగాఁగ వసించుచేతనో
ద్ధారకుఁడైన విష్ణుఁడవు। దాశరథీ కరుణాపయోనిధీ!

తాత్పర్యము -

దయకు నిధివైన దశరథ రామా! నీవు వైకుంఠమునందు రాజిల్లుచున్న లక్ష్మీదేవిని ఇచ్చట నీ భార్య సీతగా చేసుకుని, వైకుంఠము నందలి పరివారమెల్ల వీరవైష్ణవ జనులుగా వచ్చి సేవించుచుండగా, అచ్చటి విరజానది ఇచ్చట గోదావరిగా ప్రవహించుచుండ, ఆ వైకుంఠమే ఇచ్చట భద్రాద్రి యొక్క శిఖరముగా రాణింపుచుండు నీ భక్తులను ఉద్ధరించుచున్న శ్రీ మహావిష్ణువు నీవే.

- దాశరథి శతకము 20

# జ్ఞానయోగ మహాత్మ్యం

- ఓం కాళి

గంగానదీ తీరాన గల కాశీనగరంలో భరతుడు అనే పేరుగల ముని నిరంతర ఆత్మచింతనలో ఉంటూ నిత్యం భగవద్గీతలోని నాల్గవ అధ్యాయం, జ్ఞానయోగాన్ని పారాయణ చేస్తూ శ్రీ కాశీవిశ్వనాధుని సేవిస్తూ ఉండేవారు. వారు శీతోష్ణ సుఖదుఃఖాది ద్వంద్వాలకు అతీతంగా ఉండేవారు. ఒకసారి ఆ తపోధనుడు కాశీనగరం చుట్టు ప్రక్కల ఉండే దేవతలను దర్శించే నిమిత్తం నగరం నుండి బయలు దేరారు. దారిలో ఆయన రెండు రేగిచెట్ల మధ్యలో విశ్రమించారు. ఒక చెట్టు నీడలో శిరస్సు, రెండవ చెట్టు నీడలో కాళ్ళు పెట్టుకుని విశ్రమించారు. నాలుగు రోజుల తరువాత ఆ రెండు చెట్లు పూర్తిగా ఎండిపోయాయి. అనంతరం ఆ రెండు చెట్లు ఒక బ్రాహ్మణోత్తముని ఇంట కన్యలుగా జన్మించాయి.



ఆ కన్యలకు 7, 8 సంవత్సరాల వయస్సు వచ్చింది. ఒకనాడు దేశ సంచారం చేస్తూ అక్కడకు వచ్చిన భరతమునిని వారిద్దరూ చూశారు. ఆయనను చూస్తూనే ఇద్దరూ వారి పాదాలపై వ్రాలిపోయారు. "ఓ మహర్షీ! మీ దయ వలన మేమిద్దరమూ ఉద్ధరింప బడ్డాము. మాకు వృక్షరూపాలు పోయి, మానవ రూపాలు వచ్చాయి" అన్నారు. అది విని ఆ మహర్షికి ఆశ్చర్యం వేసింది. "కన్యలారా! నేను ఎప్పుడు, ఎలాగ మీ ఇద్దరికి ముక్తి కలిగించాను? అసలు మీరు వృక్షాలుగా ఎలా అవతరించారు? నాకు వివరించి తెలపండి" అని అడిగారు.

దానికి ఆ కన్యలు "మునీశ్వరా! గోదావరీ నదీ తీరంలో 'ఛిన్నపాపము' అనే పేరుగల ఒక తీర్థం ఉంది. ఆ తీర్థంలో సత్యతపుడు అనే పేరుగల మహర్షి కఠోరమైన తపస్సు చేస్తున్నాడు. ఆయన వేసవి కాలంలో అగ్నిమధ్యలో, వర్షాకాలం శిరస్సుపై వేగంగా పడే సెలయేళ్ళ క్రింద, శీతాకాలంలో చల్లని నీటిమధ్య భయంకరమైన తపస్సు చేస్తూ

ఉండేవారు. ఆయన సర్వకాల సర్వావస్థల యందునూ పవిత్రుడే. ఎప్పుడు ఇంద్రియాలను తన వశంలో ఉంచుకుని, ప్రశాంత చిత్తంతో ఆత్మానంద అనుభవంలో ఉండేవాడు. ఆయన ప్రవచనాన్ని వినటానికి బ్రహ్మదేవుడు ప్రతిరోజూ వచ్చేవాడు. నిరంతర తపస్సువల్ల సత్యతపుడు జీవన్ముక్తి పొందితే ఇంద్రపదవికి ముప్పు వస్తుందని భావించి దేవేంద్రుడు ఆయన తపస్సుకు విఘ్నం కలిగించమని మమ్మల్ని ఆదేశించాడు.

ఇంద్రుని ఆదేశానుసారము ఆ యోగీశ్వరుని మా వశంలోకి తెచ్చుకోవటానికి మేము స్వర తాళ లయ బద్ధంగా నృత్యం చేస్తూ మత్తెక్కించే కామ వికారంతో తపస్సు భగ్నం చేయటానికి ప్రయత్నం చేశాము. కాని నిర్వికార చిత్తుడైన ఆ ముని మా చేష్టలకు ఎంత మాత్రమూ లొంగక పోగా, క్రోధంతో కమండలంలోని నీళ్ళు చేతిలో పోసుకుని మా మీద చల్లి "మీరిద్దరూ నా తపస్సుకు భంగం కలిగించారు కనుక ఈ గోదావరీ తీరంలోనే రేగిచెట్లు అయి పడిఉండండి" అని శాపం ఇచ్చారు.

"మా వలన కలిగిన అపరాధాన్ని మన్నించమని మేము ప్రార్థించగా పవిత్రాత్ముడైన ఆ ముని శాంతించి, "ఇక్కడకు భరత ముని వచ్చి మీ నీడన విశ్రమించినప్పుడు మీకు శాప విముక్తి కలుగుతుంది. మీరు ఈ మానవ లోకంలో కన్యలై జన్మిస్తారు. అప్పుడు మీకు పూర్వ జన్మ జ్ఞానం కూడా ఉంటుంది" అని సెలవిచ్చారు.

"మహాత్మా! ఆ విధంగా మేము వృక్షాలుగా అవతరించాము. మీరు మా నీడన విశ్రమించి భగవద్గీత నాల్గవ అధ్యాయం జపించడం వలన మేము ఉద్ధరింప బడ్డాము. మీరు మమ్ము కేవలం శాపం నుంచే కాక భయంకరమైన ఈ ప్రపంచం నుంచి కూడా విముక్తికలిగే మార్గాన్ని చూపించారు" అని ఆ కన్యలు ఇద్దరూ భరతమునికి నమస్కరించారు.

ఆ తరువాత ఆ కన్యలు బ్రతికినంత కాలమూ భక్తిశ్రద్ధలతో నిరంతరం భగవద్గీతలోని నాల్గవ అధ్యాయమైన జ్ఞానయోగ పారాయణ చేసి, అంత్యకాలం ముక్తిని పొందారు.

(గత సంచిక తరువాయి) **సత్సంగామృతం** - మురళీ

వేదాలలో ఉపనిషత్తులలో ఏం చెప్పారు? ఎవరు ఈ జగత్తుని సృష్టిస్తున్నారు? ఎవరు దీనిని పోషిస్తున్నారు? తిరిగి ఎవరిలో ఇది లయించి పోతున్నది? అసలు దీనికంతటికి కారణం ఎవరు? ఒక్కడే!

ఆ ఒక్కడే అందరికీ దైవమై ఉన్నాడు. ఆ ఒక్కడినే మనం పట్టుకోవాలి. ఎందుకంటే తిరుపతి వెళితే అక్కడ భక్తులు కోకొల్లలు. నీకు దైవదర్శనం అవుతుంది. కాని నీలోని దైవాన్ని నీవు దర్శించుకో లేకపోతున్నావు. నీలో ఉన్న దైవం ఇతరమైనటువంటిది కాదు, నీవు చూసిన వేంకటేశ్వర స్వామియే. ఆయన ఎవరో పంపించినవాడు కాదు, ఆయన స్వయంగా నీలో ప్రతిష్ఠింప బడినవాడు.

మనం ఉపాసన చేసేటప్పుడు ప్రపంచంలో అందరూ ఉన్నారన్న విషయం మరచిపోవాలి. ఉన్నది మనదేవుడు. ఆయన ఎదుట మనం అనుభవించటానికి ఉన్నాము. అనంతమైనటువంటి ప్రభువు తత్త్వాన్ని నోటితో, చెవులతో త్రాగేయండి. ఎక్కడ ప్రభువు నామం వినిపిస్తుందో అది మనదే. అందరూ విచారణ చెయ్యండి. భగవంతుడు ఎవరి వాడు? ఆయన మనకు భిన్నంగా లేడు. నావాడు అని పిలుచుకో గలిగినది భగవంతుడు ఒక్కడినే. ఎంతమంది నావాడు అంటే అందరివాడే. ఎవరికి వాళ్ళకే స్వంతం. అనంతంగా ప్రకాశించే ప్రభువు తత్త్వం అది.

వందలాది దేవతలను పట్టుకున్నా నిన్ను నీవు తరింపజేసుకో లేవు. భగవంతుడెక్కడ ఉన్నాడని ఎక్కడెక్కడికో తిరుగుతున్నావు. ఆయన నీలోనే ఉన్నాడని చెప్పి నీకు అనుభవం కలిగించేది నీ గురుదేవుడు ఒక్కడే. గురువు అంటే సామాన్య నరుడు కాదు. గురువుకు రూపం లేదు. మనకు కావాలి కాబట్టి ఒక రూపంలో చూస్తున్నాము. మన ఉపాసనే ఆ రూపాన్ని అనుగ్రహించినది. ఉపాసకుల దీక్ష సఫలం చేయటం కోసం, అనుభవింప జేయటం కోసం, అనంతమైనశక్తి ఒక రూపాన్ని కల్పించుకున్నది. భగవద్గీతలో ప్రతి శ్లోకంలో ఉన్నది తన అనంతమైన తత్త్వం గురించేనని చెప్పారు జగద్గురువు గీతాచార్యులు. తన పుట్టుక గురించి కూడా తానే చెప్పుకున్నాడు. సాధువుల పరిరక్షణ చేయటం కోసమే తన అవతారమని చెప్పాడు. 'నేను పుట్టుక లేనివాడను' అని కూడా చెప్పాడు. అంతటా ప్రకాశించేవాడికి పుట్టుక ఎక్కడ ఉంటుంది? 'నేను పుట్టుక లేనివాడిని, నేను రూపాలు లేనివాడిని, సర్వభూతములకు ప్రభువును అయినప్పటికీ, ఈ ప్రకృతిలో ఉన్నవాటిని నేనే కావాలని తీసుకుని, నా మాయచేతనే ప్రకృతిని స్వాధీనంచేసుకుని నేను

పుట్టినవాడిలాగ కనిపిస్తున్నాను' అన్నాడు గీతాచార్యుడు.

మాయలో ఉన్న జనం గురువుగారు ఎక్కడినుంచి వచ్చారు? వారి తల్లిదండ్రులెవరు? అనే ప్రశ్నలతో ఎన్ని రకాలుగా చూస్తారో. బాహ్యమైన ఈ శరీరానికి ఎక్కడ పుట్టారు, తల్లిదండ్రులెవరు అనేవి అనవసరం. గురుదేవుడు చెప్పినది ఆచరిస్తే మనం ఇల్లు చక్కబెట్టు కున్నట్లే కదా. ఎప్పుడైతే ప్రభువు పాదాన్ని యిచ్చారో, ఎన్ని తుఫానులు వచ్చినా ఊడిపోయేది కాదు మన గుంజ. కృష్ణుడు గోవర్ధన పర్వతం ఎత్తినప్పుడు కొంతమంది భయపడి బయటే నిలబడ్డారు. అప్పుడు కృష్ణుడు 'బాలుడితడు, కొండపెద్దది అని భయపడకండి' అని చెప్పి అందరినీ పిలచి లోపలికి రప్పించుకున్నాడు.

భగవంతుడు చెప్పినట్లుగా చేయాలి. మనకు ఆయన ఏ సూచనలైతే యిస్తున్నారో వాటిని పాటిస్తూ, 'నా ప్రభువు నన్ను ఆదరిస్తున్నాడు, రక్షిస్తున్నాడు' అని గుర్తిస్తే నీ జీవితం బంగారు జీవితం అవుతుంది. ఇటువంటివి నేర్పించేదెవరు? అనేక దేవాలయాలకు వెళ్తాము. అక్కడ దేవుడిలో ఉండే దివ్యత్వాన్ని గుర్తించాలి. లేకపోతే ఊరికే దర్శనం చేసుకుని, ప్రసాదం తిని వచ్చేస్తే ఫలితం ఏమిటి? నీలోని దివ్యత్వాన్ని దర్శింపజేసేవాడు గురుదేవుడు మాత్రమే. ఆధ్యాత్మిక తత్త్వము అనుభవైకవేద్యమైనటువంటిది. కదిలే మూర్తులను ఇంట్లో బంధించాలని అనుకోకండి. వాళ్ళు ఎప్పుడూ సంచారం చేస్తూనే ఉండాలి. ప్రచారం చేస్తూనే ఉండాలి. నీకు అవసరమైతే ఆధ్యాత్మికం కావాలని గురుదేవుల వెంటపడు. జీవిత పరమార్థాన్ని గుర్తించాలి. ఎన్నో జన్మల సుకృతం వలన మహానుభావుల చెంత చేరాము. దీనిని వదలుకుంటే మరల దొరకటం కష్టం.

మనకు నిత్యమూ ఆచరణీయమైనది భగవద్గీత. ఎవరికి ఎటువంటి సంశయం కలిగినా భగవద్గీత తీరుస్తుందని గాంధీ మహాత్ములు, శంకరాచార్యులవారు చెప్పారు. మనందరికీ అనుభవం కూడా ఉంది. గురుదేవుల ఆరాధనా మహోత్సవాలలో గురుదేవులు మనలను తమ ఒళ్ళో కూర్చోబెట్టుకున్నారు. దానిని గుర్తించాలి. ఇంక మనకు చింత లేదు కదా! మనస్సును అలజడితో నింపుకోవటానికా మనం వచ్చినది? ఇటువంటి సత్యాన్ని గుర్తించి, ప్రతినిముషం కూడా భగవన్నామ స్మరణ చేసుకుంటూ గురుదేవులు ప్రసాదించిన సూచనను మనం మాటిమాటికి నెమరు వేసుకుంటూ మన జీవితాన్ని సత్యజీవితంగా మరల్చుకోవాలి. మనందరికి అట్టి భక్తిని, శక్తిని శ్రీగురుదేవులు ప్రసాదించెదరు గాక!!

(గత సంచిక తరువాయి) **హనుమద్వైభవము** - సుషుమ్న ప్రసాద

హనుమంతుడు తన వాక్చాతుర్యముతో దూత కృత్యమును చక్కగా నిర్వర్తించి, శ్రీరామ, సుగ్రీవ సఖ్యానికి చక్కటి పునాదిని వేశాడు. వాలి వధ తరువాత సుగ్రీవుడు సుఖలాలసుడై, దారా సంగమంతో మైమరచి, వర్షఋతువు దాటిపోయినా శ్రీరామునికి చేసిన ఒప్పందాన్ని విస్మరించి, భోగలాలసుడై ఉన్నాడు. లక్ష్మణస్వామి సుగ్రీవుని నిర్లక్ష్య వైఖరిని చూసి కోపోద్రిక్తుడుకాగా, హనుమ ప్రమాదాన్ని పసిగట్టి, సుగ్రీవుని వద్దకు వెళ్ళి కార్యోన్ముఖుడై వెంటనే వెళ్ళి లక్ష్మణస్వామి ఆగ్రహాన్ని చల్లార్చి తన వాగ్దానాన్ని నిలబెట్టు కొనేలాగ చేసి మంత్రిగా హితవు చెప్పి తన కర్తవ్యాన్ని నిర్వర్తించాడు.



హనుమ కార్యశూరుడు. నిరంతరము అప్రమత్తుడై కార్యసాధనకు ఉపక్రమించి, అనుచరులు అందరిలో ఉత్సాహాన్ని నింపి, కార్యోన్ముఖులను చేసేవాడు.

సుగ్రీవుడు అతని ప్రతిభను గుర్తించినాడు కనుకనే సీతాన్వేషణకై దక్షిణాది వెళ్ళే కపియూథంలో అంగద, జాంబవంతాది వీరులున్నా హనుమకే అగ్రతాంబూలం యిచ్చి, విశేషార్థము చెప్పాడు.

కార్యసాధనకు కేవలం బలము మాత్రమే చాలదు. బలంతోపాటు పరాక్రమము, బుద్ధికుశలత ఉండాలి. ఈ బుద్ధి కుశలత యుక్తిని, సమయ స్ఫూర్తిని కలుగజేస్తుంది. వీటితో దేశకాల పాత్రలను గుర్తించే ఔన్నత్యం కూడా ఉండాలి. అప్పుడే ఎవరు చేసే సాహసోపేతమైన కార్యమైనా శోభిస్తుంది. ఈ లక్షణాలన్నీ మూర్తిభవించిన ప్రతిభాశాలి హనుమ. అందుచేతనే సుగ్రీవుడు విశేషార్థము చెప్పటం జరిగింది. శ్రీరామచంద్రుడు కూడా సీతాదేవికి ఆనవాలుగా తన స్వనామాంకితమైన అంగుళీయకమును హనుమకే ఇచ్చాడు. ఇది కూడా హనుమ ప్రతిభకు సంకేతము. సత్త్వగుణ ప్రధానమైన పరాక్రమము హనుమకు ఉన్నదని

శ్రీరామచంద్రుని గట్టి నమ్మకము.

బల పరాక్రమాలతో పాటు భృత్యునకు విశేషమైన స్వామిభక్తి ఉండాలి. దాసభక్తిలో హనుమకు మించిన వారెవరూ లేరు. స్వామిభక్తి లేనివాడెప్పుడూ స్వామి కార్యమును నిర్వర్తించలేడు. అచంచలమైన ప్రభుభక్తి, వినయవిధేయతలు హనుమకు విశేషాభరణములు. స్వామి భక్తి లేకపోయినచో బలపరాక్రమాలు విద్రోహానికి దారితీయటానికి అవకాశం ఉన్నది. సీతాన్వేషణకై బయలుదేరిన కపిశ్రేష్ఠులందరూ దక్షిణ దిశలో తిరిగి తిరిగి ఒక గుహలో ప్రవేశించారు.

ఆ గుహలో స్వయంప్రభ అనే ఒక తాపసి ఉన్నది. ఆమె కపివరులు అందరికి తాజాఫలాలను ఆహారంగా సమర్పించింది. అప్పటికి సుగ్రీవుడు ఇచ్చిన గడువు దాటిపోవచ్చింది. అప్పుడు అంగదుడు మిగతా వానరులతో కలసి, గడువు దాటిపోయాక కార్యం సాధించకుండా, సుగ్రీవుని సమీపించటం కన్న నిగూఢంగా ఆ గుహలోనే ఉండిపోవటం శ్రేయస్కరం అన్నాడు. వానరులంతా అందుకు అంగీకరించారు.

హనుమ మాత్రం అంగదుడు చెప్పినట్లు చేస్తే జరిగే పూర్వాపరాలను బాగా విచారించాడు. అలా చేస్తే ప్రమాదానికి దారితీసే అవకాశం ఉంది. అంగదుడు అక్కడే ఉండే వేరొక వానర వర్గాన్ని నిర్మించి బలం పుంజుకుని సుగ్రీవునెదిరించే అవకాశం ఉంది.

వెంటనే హనుమ అంగదుని ఉద్దేశించి ఇలా సలహా ఇచ్చాడు "యువరాజా! వానర వీరుల కుటుంబాలు ఋష్యమూకంలో చాలా ఉన్నాయి. దారాపుద్రాదులను క్షోభపెట్టి చాలా కాలం ఇక్కడ ఉండటం భావ్యం కాదు. ఇక్కడ ఉన్నా లక్ష్మణుని కోపాగ్ని బాణాలకు ఆహుతి కాక తప్పదు. కిష్కింధకు భావి ప్రభువు అయిన నీవు యిక్కడ ఉండాలని నిశ్చయించటం భావ్యం కాదు" అని సలహా ఇచ్చాడు. వెంటనే అంగదుడు హనుమ సలహాను పాటించాడు. ఈ సంఘటన ఆంజనేయుని ప్రభు భక్తికి, దూరదృష్టికి తార్కాణము. 'నయ పండిత' అని సుగ్రీవుడు హనుమకు ఇచ్చిన బిరుదు ఎంతో సముచితమైనది.

-సశేషం

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి

- విజయేశ్వరానంద ప్రసాద్

**శ్రీ లలితానంద సరస్వతి స్వామి (గురువుగారి)తో శ్రీబాబు**

ఆ కాంతిగోళం నుండి ప్రణావాకారంతో ఒక కాంతి పుంజం వెలువడింది. నెమ్మదిగా దానిలో నుండి తెల్లగా మెరిసిపోయే కాంతి పుంజం ఒకటి బయటకు వచ్చి, శంఖ చక్ర గదాధారియైన శ్రీమహా విష్ణువు ఆకారం ధరించి కనిపించింది. ఆ తరువాత రక్తవర్ణంతో కూడిన కాంతిపుంజం చతుర్ముఖ బ్రహ్మ ఆకృతి ధరించి కనిపించింది. ఆ తరువాత నీలవర్ణపు కాంతిపుంజం వచ్చి జటాజూటధారియైన శివుని ఆకారంలో కనిపించింది. కొంతసేపు ఇలా దర్శనమిచ్చిన తరువాత, ఆ త్రిమూర్తుల ఆకృతులు తిరోధానమై అనంత కాంతిగోళంలో కలిసి పోయాయి.



మరి కొంతసేపటికి ఆ కాంతి గోళం నుంచి శ్రీరామచంద్రుని ఆకృతిలో ఒక కాంతి పుంజము, అది అంతర్ధానమై, శ్రీ కాళీ రూపంలో ఒక కాంతిపుంజము కనిపించాయి. ఈ దర్శనాలన్నీ దిగ్భ్రాంతులై చూస్తున్న గురువుగారు తమ్ముతాము మరచిపోయి అనిర్వచనీయమైన అనుభూతిలో అనిమిషులై ఉండిపోయారు. కొంతసేపటికి ఆ కాంతి గోళము గది అంతా నిండిన వెలుగు, అన్నీ శ్రీబాబు ఉన్నచోట లయించి పోయాయి. శ్రీబాబు అఖండతేజో రూపులై ప్రకాశిస్తూ కొంతసేపు దర్శనం ఇచ్చారు. ఆ తరువాత కరెంట్ వచ్చింది.

ఆనందంతో తబ్బిబ్బులవుతున్న గురువుగారిని చూసి, ఏమీ ఎరుగునట్లు శ్రీబాబు "ఏమిటి? నీ ముఖం అంత ఆనందంతో వెలిగి పోతోంది?" అన్నారు. 'ఆ వెలుగంతా మీ నుండి వచ్చినదే' అంటూ జరిగినందతా వివరించారు గురువు గారు. "ఏమిటో చాలా చెప్పేస్తున్నావు. అదంతా నీ ఊహాలోకంలో కనిపించిందేమో!" అన్నారు శ్రీబాబు. 'అది ఏ లోకమైనా కానీయండి. ఆ లోకంలోనే నన్ను ఉంచకుండా నన్ను మళ్ళీ ఈ లోకంలోకి ఎందుకుతెచ్చి పెడతారు?'

అన్నారు గురువుగారు. "నిన్ను ఆ లోకంలోనే ఉంచేస్తే, ఇప్పుడు నాకు నివేదన ఎవరు పెడతారు? ముందు వెళ్ళి తీసుకురా!" అన్నారు నవ్వుతూ శ్రీబాబు. ఈ దివ్యానుభూతిని విన్న భక్తులు గురువుగారితో 'మీ బోటి మహనీయుల సాహచర్యం వలన మాకు శ్రీబాబు యొక్క దివ్యతత్త్వం ఏమిటో ఈ మాత్రమైనా తెలిసింది' అన్నారు. ఆమె 'నిజమే మన అజ్ఞానమనే పెంజీకటికెవ్వల నెవ్వండేకాకృతి వెలుగునో ఆ వెలుగే శ్రీబాబు' అన్నారు.

ఇందిర వ్యాధిని నెపంగా చేసుకుని శ్రీబాబు గురువుగారికి, ఇందిరకు, వారి కుటుంబ సభ్యులకు కూడా ఎంతో రక్షణను, ఎన్నెన్నో దివ్యానుభూతులను కలిగించటం ద్వారా వారిలో శ్రీగురు స్వరూపుడైన భగవానుని యందు అచంచల భక్తివిశ్వాసాలను పెంపొందించ గలిగారు.

ఇందిర భీమవరంలో ఉన్నరోజుల్లో ఒకనాడు శ్రీబాబు స్వీకరించగా మిగిలిన మజ్జిగను గురువుగారి తల్లిగారు శ్రీగురు భుక్త శేషమైన మహాప్రసాదంగా భావించి తీసుకున్నారు. తత్ఫలితంగా ఆమెకు శ్రీబాబు పరంజ్యోతి స్వరూపంగాను, అఖండ తేజోమూర్తిగాను దర్శన మిచ్చి దివ్యానుభూతిని ప్రసాదించారు. ఆమె అదే స్థితిలో కొన్ని గంటల పాటు దేహస్మృతి లేకుండా ఉండిపోయారు. ఎవరు లేపినా తెలివి రాలేదు. 'శ్రీబాబు మిమ్మల్ని లేవమంటున్నారు' అని చెబితే లేచారు. శ్రీబాబు ఆమెకు ఈ విధంగా ప్రసాదించిన ప్రతిలేని చిత్తోపరతి సుఖాన్ని గురించి ఆమె తమ అంత్యకాలం వరకు చెప్పుకుని తన్మయత్వం పొందేవారు.

ఇందిర గుంటూరులో ప్రతిరోజూ కాలేజీకి వెళ్ళేముందు శ్రీబాబుకు నమస్కారం చేసుకుని వెళ్ళేది. ఒకరోజు ఉదయం అలాగే నమస్కారం చేసుకోవటానికి వెళ్ళినప్పుడు శ్రీబాబు "ఈరోజు కాలేజీకి వెళ్ళవద్దు" అన్నారు. ఏ కారణమూ లేకుండా మానటం ఎందుకని ఇందిర 'ఏమి ఇవ్వాళ పాదపూజ ఉన్నదా?' అని అడిగింది. శ్రీబాబు వెంటనే తీవ్ర స్వరంతో "నువ్వు వెంటనే కాలేజీకి వెళ్ళు పో!" అన్నారు. స్వామి వద్దు అన్నప్పుడు ఎదురుప్రశ్న వేయటం మంచిదికాదని గ్రహించిన ఇందిర 'కాలేజీకి వెళ్ళను బాబూ ఉండిపోతాను' అని ప్రాధేయపడి అడిగింది. అయినా శ్రీబాబు ససేమిరా అన్నారు. ఇందిరకు కాలేజీకి వెళ్ళక తప్పలేదు.

-సశేషం

## విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

# 8. సదాశివ బ్రహ్మేంద్ర సరస్వతి

తిరు చందూరులో ఒకచోట వివాహం జరుగుతుండగా సదాశివ బ్రహ్మేంద్రులు అటుగా వెళ్తున్నారు. వివాహమండపం అత్యద్భుతంగా అలంకరించబడి ఉంది. బాజాభజంత్రీలు మ్రోగుతున్నాయి. పెళ్ళివారంతా ఆనందోత్సాహంగా ఉన్నారు. ఇంతలో పెళ్ళి కుమార్తెను త్రాచుపాము కరిచి ఆవిడ మరణించింది. కాలికి రాచిన పారాణి ఆరకుండానే కాటికి ప్రయాణం చేయ వలసి వచ్చింది. వివాహ ప్రాంగణం కొన్ని నిముషాలలోనే శోకగ్రస్తమైంది.



ఇది చూసిన సదాశివబ్రహ్మేంద్రులవారి హృదయం ద్రవించింది. పెళ్ళి కుమార్తెను సమీపించారు. మూతపడిన కనురెప్పలు తెరిచారు. చైతన్యహీనమైన ఆ నేత్రాలలో తన అమృత దృష్టిని సారించారు. అంతే! నిద్రనుండి లేచినట్లు పెళ్ళికుమార్తె లేచింది. పెళ్ళివారి హృదయాలు కృతజ్ఞతా భావంతో నిండిపోయాయి.

చివరి దశలో స్వాములవారు సంచారం మాని నేరూరులో స్థిరంగా వుండిపోయారు.

ఒక నాడు పిల్లలు మధురలో జరిగే సుందరేశ్వరుని తిరునాళ్ళు చూడాలని అడిగారు. దీనదయాళుడైన సదాశివబ్రహ్మేంద్రులవారు వారిని కళ్ళు మూసుకోమని సైగ చేశారు. కళ్ళు మూసుకోగానే మధురలో వున్నారు. స్వామి పిల్లలకు తిరునాళ్ళు చూపించి, తినుబండారములను కొనిపెట్టి మళ్ళీ కళ్ళు మూసుకోమన్నారు. కళ్ళు మూసుకోగానే నేరూరులో ఉన్నారు. సదాశివబ్రహ్మేంద్రుల వంటి జ్ఞానులు చేయలేని పని ఏముంటుంది?

సదా ఆత్మస్థితుడై ఉదాసీనంగా సంచరిస్తూ, అందరిని ప్రేమిస్తూ, మంచిని పంచుతూ, తామరాకుపై నీటిబొట్టు వలె దేహంతో సంబంధం

లేక మనుగడ సాగిస్తున్న సదాశివబ్రహ్మేంద్రులవారు శరీరాన్ని త్యాగం చేసే సమయం ఆసన్నమైనది. సదాశివ బ్రహ్మేంద్రులవారు భక్తుల నందరిని పిలిచి తమ అంతిమ సందేశాన్ని వ్రాశారు-

"పాంచభౌతిక ఈ శరీరాన్ని నేను త్యజించనున్నాను. ఇక్కడ ఒక గుంట త్రవ్వి అందులో నా శరీరాన్ని సమాధి చేయండి. సమాధి పైన బిల్వ మొక్కను నాటండి. కాశీ నుండి ఒక బ్రాహ్మణుడు శివలింగాన్ని తెస్తాడు. ఆ శివలింగం శ్వేతవర్ణంలో ఉంటుంది. శివలింగాన్ని సమాధి పై ప్రతిష్ఠ చేసి నిత్యపూజ జరిగేలా చూడండి. భగవంతుని నమ్మి జీవించండి. ప్రపంచము అస్థిరము. ఆశాశ్వతము. భగవానుడు హృదయ కుహరంలో ఉన్నాడు. కదిలే ఇంద్రియాలను కదిలే మనస్సునీ కట్టివేసి ఆత్మధ్యానంలో స్థిర పడండి. సత్యాత్మను తెలుసుకోండి. సత్యాన్ని విశ్వసించండి. సత్యమే మిమ్మల్ని నడిపిస్తుంది. అని వ్రాశారు.

సదాశివ బ్రహ్మేంద్రులవారు దివ్య పారవశ్యంలో ఉన్నారు. భక్తులు దు:ఖాన్ని ఆపుకోలేక పోతున్నారు. ఒక భక్తుడు ఆవేశంతో "భగవాన్! మిమ్మల్ని వదిలి మేము జీవించలేము. మీరు వెళ్తే మాకు ఎవరు దిక్కు? మేము భగవంతుని చేరేది ఎలాగు? భగవంతుని చేరటానికి మేము ఏమి చేయాలి? తెలియచేయండి." అని భోరున ఏడ్చాడు. అంతర్ముఖుడు అవుతున్న సదాశివబ్రహేంద్రుల వారు తీవ్ర ప్రయత్నంలో కళ్ళు తెరిచారు. దు:ఖిస్తున్న భక్తుని చూశారు. బ్రహ్మము చేరే మార్గం తెలుపమంటున్నాడు. బ్రహ్మము లేనిది ఎక్కడ? అంతా నిండి ఉన్న బ్రహ్మాన్ని చేరేదేమిటి? అందరూ బ్రహ్మంలోనే ఉన్నారు. అని చివరి కీర్తన ద్వారా తమ సందేశాన్ని వ్రాసి ఇచ్చారు.

*సర్వం బ్రహ్మ మయం రేరే*
*సర్వం బ్రహ్మ మయం*
*కింవచనీయం కిమ వచనీయం*
*కింరచనీయం కిమరచనీయం* || సర్వం ||
*కింపఠనీయం కిమపఠనీయం*
*కింభజనీయం కిమభజనీయం* || సర్వం||
*కింభోధవ్యం కిమభోధవ్యం*
*కింభోక్తవ్యం కిమభోక్తవ్యం* || సర్వం||
*సర్వత్ర సదా హంసధ్యానం*
*కర్తవ్యం భో ముక్తినిదానం* || సర్వం ||

"ఉన్నదంతా బ్రహ్మమే! అంతటా నిండిన బ్రహ్మకు గుర్తు ఏం చెప్పాలి? ఎలారాయాలి? ఎలాగానం చేయాలి? ప్రభోధం ఎలా చేయాలి? ప్రభోధింపబడే దెవరు? "నిరంతరం నేను బ్రహ్మను" అనే భావంతో ఉండి పోవటమే ముక్తి. అదే మోక్షము" అని తెలియ చేశారు.

నాటకం ముగియగానే తెరపడినట్లు చైతన్యం చైతన్యం లో లయించగానే కళ్ళు మూతలు పడ్డాయి. సదాశివ బ్రహ్మేంద్రుల వారి శరీరము అంతిమ శ్వాసను వదిలింది. అదే సమయానికి ఒక బ్రాహ్మణుడు శ్వేతలింగాన్ని తెచ్చాడు. ఒక మహాత్ముని ఆజ్ఞ మేరకు తెచ్చానని చెప్పాడు.

సదాశివబ్రహ్మేంద్రుల వారి భౌతిక కాయాన్ని సమాధి చేసి, దానిపై బిల్వమొక్కను నాటారు. సమాధి ముందు శివలింగాన్ని ప్రతిష్ఠ చేశారు. కదిలే కొయ్యమొద్దులా తన జీవితకాలంలో ఎన్నో లోక కళ్యాణ కార్యాలు చేశారు. ఈ నాడు కదలని బిల్వవృక్ష రూపంలో ఆశ్రితులను అనుగ్రహిస్తున్నారు. నిత్యపూజలు ఉత్సవాలు వైభవంగా ఇప్పటికీ జరుగుతున్నాయి.

పూర్ణమద: పూర్ణమిదం । పూర్ణాత్పూర్ణముదచ్యతే।
పూర్ణస్య పూర్ణమాదాయ ।పూర్ణమేవాऽ-శిష్యతే॥

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, విజయవాడ వాస్తవ్యులు అయిన శ్రీమతి వంకాయలపాటి కామేశ్వరీ మహలక్ష్మి గారు ( వి. ప్రభాకర శర్మగారి ధర్మపత్ని)1-10-2014 బుధవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 63సంవత్సరాలు.

సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## హైదరాబాద్ శాఖ  భవన నిర్మాణం

ప్రియాత్మ బంధువులారా!

హైదరాబాద్‌లో ఉన్న ఆశ్రమ ప్రాంగణంలో ఐదు అంతస్థుల భవన నిర్మాణం చేయాలని సంకల్పించటమైనది అన్న విషయం బాబూజీ మహరాజ్ భక్తులమైన మనందరికీ తెలిసినదే. ధనాభావం చేత 5వ అంతస్థు నిర్మాణం ఆపివేసి 4అంతస్థులకు స్లాబులు వెయ్యటం జరిగింది. భక్తులు ఇప్పటివరకు ఇచ్చిన విరాళాలతో తదితర నిర్మాణపు పనులు కూడా చురుకుగా సాగుతున్నాయి.



పూజ్య మాతాజీవారు ఈ నూతన భవన ఆవిష్కరణకు, శ్రీ సద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠకు జనవరి 22వ తేదీ తెల్లారుజామున 1గం॥35నిలకు ముహూర్తం కూడా నిర్ణయించినారు. కనుక భక్తులందరూ ఈ బృహత్కార్యంలో పాల్గొని, వస్తురూపంలోకాని, ధనరూపంలోకాని తమ సహాయ సహకారాలను అందించమని ప్రార్థిస్తున్నాము. భక్తులు విరివిగా విరాళాలు అందించి శ్రీ మాతాజీ నిర్ణయించిన సమయానికి ఈ భవన నిర్మాణం పూర్తి చేయటానికి తోడ్పడమని విన్నవించుకుంటున్నాము.

మీ విరాళాలను క్రాస్ చేసిన చెక్కు లేక డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరుతున్నాము. ఇతర వివరాలకు శ్రీకుమారస్వామి రాజాగారిని (సెల్ నం.09346535357) సంప్రదించి తెలుసుకోవలసిందిగా కోరుతున్నాము. మీరు ఇచ్చే విరాళాలకు ఐ.టి సెక్షన్ 80 జి రాయితీ లభిస్తుంది.

శ్రీబాబు భక్త సమాజ్ (హైదరాబాద్)

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL